www.hamsakalam.com
సంచలన తెలుగు దినపత్రిక
PRGI: TGTEL/26/A3129

# హంస కలం వార్త

HAMSA KALAM VARTA
చీఫ్ ఎడిటర్: వడ్ల మధుసూదన్ చారి

EDITOR :VADLA MADHUSUDHAN CHARY  MEDCHAL /MALKAJGIRI  VOLUME:1  ISSUE:53  SATURDAY ,JULY 04,2026  PAGES:8  COST: 4 /-

ఎడిటర్ : వడ్ల మధుసూదన చారి  మేడ్చల్ /మల్కాజిగిరి  సంపుటి : 1  సంచిక : 53  శనివారం 04 జూలై 2026  పేజీలు :8  వెల: 4/-

# అప్పులతో తెలంగాణను సర్వనాశనం చేశారు



## అప్పుల లెక్కల్లో పొంతన లేదు

### మంత్రి చెప్పింది ఒకటి.. సీఎం చెప్పింది మరొకటి

- రాష్ట్ర అప్పుల విషయంలో కాంగ్రెస్ అబద్ధాలు చెబుతోందన్న హరీశ్ రావు
- సంగారెడ్డిలో జరిగిన అవగాహన సదస్సులో ప్రభుత్వ తీరుపై విమర్శలు
- మంత్రి జూపల్లి లేఖ ప్రకారం అప్పు రూ.1.77 లక్షల కోట్లు అని వెల్లడి
- అసెంబ్లీలో సీఎం చెప్పిన అప్పు రూ.3.45 లక్షల కోట్లు అని గుర్తు చేసిన మాజీ మంత్రి

హంసకలం వార్త : రాష్ట్ర అప్పుల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం అబద్ధాలు చెబుతో oదని, ప్రభుత్వ పెద్దల మధ్యే లెక్కల్లో పొంతన లేదని మాజీ మంత్రి, బీఆర్ ఎస్ నేత హరీశ్ రావు తీవ్రంగా విమ ర్శించారు. సంగారెడ్డిలో ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ అధ్యక్షతన 'ఎస్ఐ ఆర్'పై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా మిగతా2లో

## బీఆర్ఎస్ అప్పులు రూ.8.21 లక్షల కోట్లు కాదా?.. కేసీఆర్‌కు భట్టి సవాల్!

### అప్పులపై కేసీఆర్ సమాధానం చెప్పాలని డిమాండ్
### కాంగ్రెస్ ప్రభుత్వం వడ్డీ భారం తగ్గించిందన్న డిప్యూటీ సీఎం
### సింగరేణిని బీఆర్ఎస్ సంక్షోభంలోకి నెట్టిందని విమర్శ



హంసకలం వార్త : తెలంగాణ అప్పులపై అధికార, ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధం కొనసాగుతోంది. ఈసారి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఘాటు ఆరోపణలు చేశారు. బీఆర్ఎస్ హయాంలో భారీ అప్పులు చేశారని అన్నారు. అప్పులపై కేసీఆర్, హరీశ్ రావు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. మాజీ మంత్రి హరీశ్ రావు తెలంగాణ ఆర్థిక పరిస్థితిపై పచ్చి అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని భట్టి మండిపడ్డారు. సచివాల యంలో మీడియాతో మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం తీసుకున్న అప్పు లు, ఆర్థిక వ్యవహారాలపై వివరాలు వెల్లడించారు. తమ తప్పులను కప్పిపు చ్చుకునేందుకే కేటీఆర్, హరీశ్ రావు ఎదురుదాడి మిగతా2లో

## వైద్య రంగంలో ఉస్మానియా అరుదైన ఘనత



హంసకలం వార్త : నగరంలోని ఉస్మానియా ఆస్పత్రిలో 5 అవయవాల మార్పిడి శస్త్రచికిత్సను వైద్యులు విజ యవంతంగా పూర్తి చేశారు. దీంతో వైద్యులను వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర నరసింహ ఘనంగా సన్మా నించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'తెలంగాణ రాష్ట్ర వైద్య రంగంలో సరికొత్త అధ్యాయం లిఖించ బడింది. దేశ వైద్య చరిత్రలోనే అత్యం త అరుదైన ఘనతను ఉస్మానియా ప్రభుత్వ ఆస్పత్రి సొంతం చేసుకుంది. అవయవదానం అనేది మహాదానం, ఈ సందేశాన్ని సమాజంలోకి 2లో

## లెక్కలు తప్పైతే రాజీనామా చేస్తా..




### మీరు బీఆర్ఎస్ పార్టీని రద్దు చేస్తారా?: జూపల్లి

### తెలంగాణ అప్పులపై చర్చకు తాను సిద్ధమన్న జూపల్లి
### పాలమూరు పౌరుషమా, కల్వకుంట్ల పౌరుషమా తేల్చుకుందామని సవాల్

హంసకలం వార్త : తెలంగాణ ప్రభుత్వం చేస్తున్న అప్పులపై అధికార కాంగ్రెస్ పార్టీ, ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీ నేతల మధ్య మాటల తూటాలు పేలుతున్నాయి. "తెలంగాణ అప్పులపై చర్చకు నేను సిద్ధం. సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌కు సాయంత్రం 5 గంటలకు వస్తా. మరి బీఆర్ఎస్ నేతలు సిద్ధమేనా?" అంటూ రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు సవాల్ విసిరారు. "ఖబడ్దార్ కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు. పాలమూరు మిగతా2లో




## దేశంలోనే తొలిసారి.. ఈ-వేలంలో విమానాన్ని విక్రయించిన ఈడీ

హంసకలం వార్త : దేశంలోనే తొలిసారిగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ స్వాధీనం చేసుకున్న ఓ విమానాన్ని ఈ-వేలం ద్వారా విక్రయించింది. హైదరాబాద్ జోనల్ ఈడీ స్వాధీనం చేసుకున్న హాకర్ 800A విమానాన్ని విక్ర యించేందుకు ఈ నెల 1న ఎంఎస్‌టీసీ ద్వారా ఆక్షన్ నిర్వహించగా.. రూ. 3 కోట్లకు అమ్ముడు పోవడం విశేషం.హాకర్ 800A విమానం అనేది అంతకుముందు ఫాల్కన్ పోంజీ కేసు ప్రధాన నిందితుడు అమర్‌దీప్ కుమార్‌కు చెందినది. అయితే అమర్‌దీప్ నకిలీ ఇన్వాయిస్ డిస్కౌంటింగ్ పేరుతో రూ.792 కోట్ల మోసానికి మిగతా2లో



## క్రిస్టియన్ మైనారిటీలకు శుభవార్త..

### సంక్షేమ పథకాల కోసం ఆన్‌లైన్ దరఖాస్తులు ప్రారంభం

హంసకలం వార్త :రాష్ట్రంలోని క్రిస్టియన్ మైనారిటీల సంక్షేమ పథకాల కోసం ప్రభుత్వం ఆన్‌లైన్ దరఖాస్తులను ప్రారంభించింది. ఈ మేరకు మంత్రి మహమ్మద్ అజారుద్దీన్ ఓబీఎంఎంఎస్ పోర్టల్‌ను ప్రారంభించారు.అర్హులైన క్రిస్టియన్ మిగతా2లో

## ఎస్ఐఆర్ నిలిపేయండి




- -సుప్రీంకోర్టుకు విపక్షాల వినతి
- -సుప్రీంకోర్టుకు 23 మంది విపక్ష నేతల లేఖ
- -ఓటర్ల తొలగింపుపై తీవ్ర అభ్యంతరం
- -ఈవీఎంలపై ప్రజా చర్చ కోరిన విపక్షాలు
- -కేంద్ర సంస్థలను దుర్వినియోగం చేస్తున్నారని ఆరోపణ
- -ప్రజాస్వామ్యం ప్రమాదంలో ఉందని వ్యాఖ్య



## ప్రధాని మోదీకి 'చిన్న చెల్లెలు' వచ్చింది!

- జపాన్ ప్రధానిని చెల్లెలుగా సంబోధించిన ప్రధాని మోదీ
- షింజో అబేను అన్నయ్యగా భావించేదాన్నని వెల్లడించిన తకాయిచి
- తొలి భారత పర్యటనకు వచ్చిన జపాన్ తొలి మహిళా ప్రధాని తకాయిచి

హంసకలం వార్త :భారత్, జపాన్ దేశాల మధ్య వ్యూహాత్మక సంబంధాలు నూతన శిఖరాలకు చేరుతున్నాయి. కేవలం అధికారిక చర్చలకే పరిమితం కాకుండా, ఇరు దేశాల అధినేతల మధ్య నెలకొన్న బలమైన వ్యక్తిగత అనుబంధానికి నిదర్శనంగా నిలిచి ఒక అరుదైన సన్నివేశం న్యూఢిల్లీలో ఆవిష్కృతమైంది. జపాన్ ప్రధానమంత్రి సనాయ్ తకాయిచిని భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఎంతో ఆత్మీయంగా తన 'చెల్లెలు' మిగతా2లో

## ఇన్నాళ్లూ ఖమేనీ భౌతిక కాయాన్ని ఎలా భద్రపరిచారో తెలుసా?

అమెరికా-ఇజ్రాయెల్ దాడుల్లో మరణించిన ఖమేనీ -నాలుగు నెలల తర్వాత ప్రారంభమైన అంత్యక్రియలు -ఇంతకాలం కోల్డ్ స్టోరేజ్‌లో భద్రపరిచిన భౌతికకాయం -వివిధ నగరాల్లో భారీ స్థాయిలో తుది వీడ్కోలు ఏర్పాట్లు -జూలై 9న మషద్‌లో జరగనున్న ఖననం 2



## ప్రక్షాళన దిశగా బీజేపీ జాతీయ కార్యవర్గం..

### అమిత్ షాతో అధ్యక్షుడు నితిన్ నబిన్ కీలక భేటీ..

హంసకలం వార్త :భారతీయ జనతా పార్టీ కేంద్ర సంస్థాగత వ్యవస్థలో కీలక మార్పులు చోటుచేసుకునే సూచనలు కనిపిస్తున్నాయి. పార్టీ కొత్త కేంద్ర బృందం ఏర్పాటు, జాతీయ మిగతా2లో

# వైద్య రంగంలో ఉస్మానియా అరుదైన ఘనత

నగరంలోని ఉస్మానియా ఆస్పత్రిలో 5 అవయవాల మార్పిడి శస్త్రచికిత్సను వైద్యులు విజయవంతంగా పూర్తి చేశారు. దీంతో వైద్యులను వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర నరసింహ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'తెలంగాణ రాష్ట్ర వైద్య రంగంలో సరికొత్త అధ్యాయం లిఖించబడింది. దేశ వైద్య చరిత్రలోనే అత్యంత అరుదైన ఘనతను ఉస్మానియా ప్రభుత్వ ఆస్పత్రి సొంతం చేసుకుంది. అవయవ దానం అనేది మహాదానం, ఈ సందేశాన్ని సమాజంలోకి మరింత విస్తృతంగా తీసుకెళ్లాల్సిన అవసరం ఉంది.' అని అన్నారు. ఉస్మానియా ప్రభుత్వ ఆస్పత్రిలో తొలిసారిగా 5 అవయవాల మార్పిడి శస్త్రచికిత్సను వైద్యులు అత్యంత విజయవంతంగా పూర్తి చేశారు. సుమారు 36 గంటల పాటు ఎంతో క్లిష్టంగా సాగిన ఈ శస్త్రచికిత్సను విజయవంతం చేసిన డాక్టర్ మధుసూదన్ నేతృత్వంలోని వైద్య బృందాన్ని వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ సచివాలయంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వైద్యుల ప్రతిభను, వారి అంకితభావాన్ని మంత్రి ప్రత్యేకంగా అభినందించారు. అవయవదానం అనేది మహాదానమని, ఈ సందేశాన్ని సమాజంలోకి మరింత విస్తృతంగా తీసుకెళ్లాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆయన ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. రాష్ట్రంలో ప్రభుత్వ ఆస్పత్రులను కార్పొరేట్ స్థాయికి తీసుకెళ్లేందుకు ప్రభుత్వం గట్టి సంకల్పంతో పనిచేస్తోందని మంత్రి దామోదర స్పష్టం చేశారు. ఇందులో భాగంగానే వైద్య రంగ బలోపేతానికి పెద్దపీట వేస్తూ గత రెండున్నరేళ్ల కాలంలోనే 15 వేల ఉద్యోగాలను భర్తీ చేశామని వెల్లడించారు. అంతేకాకుండా, తాజాగా మరో 6,238 పోస్టుల భర్తీకి ప్రభుత్వం ఆమోదం తెలిపిందన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో అత్యాధునిక వైద్య సదుపాయాలను నిరంతరం విస్తరిస్తున్నామని, ఉస్మానియా వైద్యుల ఘనతతో తెలంగాణ వైద్య రంగానికి జాతీయ స్థాయిలో గొప్ప గుర్తింపు లభించిందని మంత్రి దామోదర్ రాజనర్సింహ హర్షం వ్యక్తం చేశారు.

# లెక్కలు తప్పైతే రాజీనామా చేస్తా..

తెలంగాణ ప్రభుత్వం చేస్తున్న అప్పులపై అధికార కాంగ్రెస్ పార్టీ, ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీ నేతల మధ్య మాటల తూటాలు పేలుతున్నాయి. "తెలంగాణ అప్పులపై చర్చకు నేను సిద్ధం. సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌కు సాయంత్రం 5 గంటలకు వస్తా. మరి బీఆర్ఎస్ నేతలు సిద్ధమేనా?" అంటూ రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు సవాల్ విసిరారు. "ఖబడ్దార్ కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు. పాలమూరు పౌరుషమా, కల్వకుంట్ల పౌరుషమా తేల్చుకుందాం రండి" అని ధ్వజమెత్తారు. తన లెక్కలు తప్పు అయితే మంత్రి, ఎమ్మెల్యే పదవులకు తక్షణమే రాజీనామా చేస్తానని, మరి వారి లెక్కలు తప్పైతే రాజీనామా చేస్తారా? బీఆర్ఎస్ పార్టీని రద్దు చేస్తారా? అని ఛాలెంజ్ చేశారు. కేసీఆర్ రాకపోతే జూపల్లి చెప్పే లెక్కలు నిజమేనని మీడియా ముందు ఒప్పుకోవాలని అన్నారు. అసెంబ్లీలో రాష్ట్ర అప్పులపై కేటీఆర్, హరీశ్‌రావు ఒక్కొక్కరు ఒక్కో రకమైన అబద్ధపు లెక్కలు చెప్పారని జూపల్లి విమర్శించారు. కేసీఆర్ ప్రభుత్వం దిగిపోయే నాటికి రాష్ట్రంపై ఏకంగా రూ.8,21,651 కోట్ల అప్పుల భారం మోపారని ఆయన మండిపడ్డారు. కార్పొరేషన్ల ద్వారా దొంగచాటుగా తెచ్చిన అప్పులను వీరు ఎందుకు దాస్తున్నారని ప్రశ్నించారు. తాను ఆత్మగౌరవం కోసం ప్రభుత్వ ఉద్యోగానికి రాజీనామా చేసి, వ్యాపారాలు చేసుకుని రాజకీయాల్లోకి వచ్చానని.. పారిపోయే లక్షణం తనకు లేదని, అబద్ధాలు చెప్పే అలవాటు అంతకన్నా లేదని స్పష్టం చేశారు.

# దేశంలోనే తొలిసారి.. ఈ-వేలంలో విమానాన్ని విక్రయించిన ఈడీ

దేశంలోనే తొలిసారిగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ స్వాధీనం చేసుకున్న ఓ విమానాన్ని ఈ-వేలం ద్వారా విక్రయించింది. హైదరాబాద్ జోనల్ ఈడీ స్వాధీనం చేసుకున్న హాకర్(ఝుఎవతీ) 800గూ విమానాన్ని విక్రయించేందుకు ఈ నెల 1న ఎంఎస్‌టీసీ ద్వారా ఆక్షన్ నిర్వహించగా.. రూ.3 కోట్లకు అమ్ముడుపోవడం విశేషం. హాకర్ 800గూ విమానం అనేది అంతకుముందు ఫాల్కన్ పోంజీ కేసు ప్రధాన నిందితుడు అమర్‌దీప్ కుమార్‌కు చెందినది. అయితే అమర్‌దీప్ నకిలీ ఇన్వాయిస్ డిస్కౌంటింగ్ పేరుతో రూ.792 కోట్ల మోసానికి పాల్పడినట్టు ఈడీ తేల్చింది. దర్యాప్తులో భాగంగా ఈ విమానాన్ని గత మార్చి 7న ఈడీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఆ తర్వాత.. చట్టపరమైన ప్రక్రియ ద్వారా, పీఎంఎల్ఏ అడ్జుడికేటింగ్ అథారిటీ అనుమతితో దీనిని ఈ-వేలంలో రూ.3 కోట్లకు విక్రయించారు. ఈ సొమ్మును బాధిత పెట్టుబడిదారులకు తిరిగి చెల్లించనున్నారు. కాగా.. ఈ కేసులో ఇప్పటికే ముగ్గురు నిందితులు అరెస్ట్ అవ్వగా, దర్యాప్తు కొనసాగిస్తున్నట్టు ఈడీ తెలిపింది. అయితే.. ఈడీ స్వాధీనం చేసుకున్న విమానాన్ని పూర్తిగా ఆన్‌లైన్ విధానంలో విక్రయించడం దేశంలో ఇదే తొలిసారి కావడం విశేషం. ఆస్తుల విక్రయ ప్రక్రియలో పారదర్శకత, పోటీ వాతావరణం కల్పించడం సహా ప్రభుత్వ ఆదాయాన్ని మరింత పెంచే దిశగా ఈ విధానం ఉపయుక్తమవుతుందని అధికారులు భావిస్తున్నారు.

# ప్రధాని మోదీకి 'చిన్న చెల్లెలు' వచ్చింది

భారత్, జపాన్ దేశాల మధ్య వ్యూహాత్మక సంబంధాలు నూతన శిఖరాలకు చేరుతున్నాయి. కేవలం అధికారిక చర్చలకే పరిమితం కాకుండా, ఇరు దేశాల అధినేతల మధ్య నెలకొన్న బలమైన వ్యక్తిగత అనుబంధానికి నిదర్శనంగా నిలిచి ఒక అరుదైన సన్నివేశం న్యూఢిల్లీలో ఆవిష్కృతమైంది. జపాన్ ప్రధానమంత్రి సనాయ్ తకాయిచిని భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఎంతో ఆత్మీయంగా తన 'చెల్లెలు' అని సంబోధించారు. న్యూఢిల్లీ వేదికగా జరిగిన 16వ భారత్-జపాన్ వార్షిక శిఖరాగ్ర సదస్సు సందర్భంగా ఈ ఆసక్తికర సంభాషణ చోటుచేసుకుంది. హైదరాబాద్ హౌస్‌లో నిర్వహించిన సమావేశంలో, దివంగత మాజీ ప్రధాని షింజో అబేను తాను సొంత అన్నయ్యలా భావించేదాన్నని తకాయిచి గుర్తుచేసుకున్నారు. అబేకు ప్రధాని మోదీ అత్యంత సన్నిహితులు కావడంతో, తనూ ఆయనను అదే దృష్టితో చూస్తున్నానని ఆమె పేర్కొన్నారు. దీనికి స్పందించిన మోదీ, ఆమెను 'చిన్న చెల్లెలు' అని సంబోధించారు. ఈ అనుబంధంతోనే ఇరు దేశాల ద్వైపాక్షిక సంబంధాలను మరింత ఉన్నత స్థాయికి తీసుకెళతామని ఇరు నేతలు ఆకాంక్షించారు. జపాన్ తొలి మహిళా ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత తకాయిచి భారత్‌లో జరిపిన తొలి అధికారిక పర్యటన ఇది. ఈ పర్యటనలో భాగంగా ఇరు దేశాల మధ్య చరిత్రాత్మక ఒప్పందాలు కుదిరాయి. ముఖ్యంగా రక్షణ రంగంలో సంయుక్త అభివృద్ధి కోసం తొలిసారిగా ఒప్పందం కుదుర్చుకున్నారు. ఆర్థిక, ఇంధన భద్రతపై ఒక స్పష్టమైన రోడ్‌మ్యాప్‌ను ఆవిష్కరించడంతో పాటు, రానున్న పదేళ్లలో జపాన్ నుంచి 10 ట్రిలియన్ యెన్ల పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. ఈ సదస్సు ఇరు దేశాల మధ్య నెలకొన్న ప్రత్యేక వ్యూహాత్మక భాగస్వామ్యంలో ఒక నూతన అధ్యాయానికి నాంది అని ప్రధాని మోదీ అభివర్ణించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సెమీకండక్టర్లు, ఇంధన రంగాల్లో పరస్పర సహకారంపై ఇరువురు నేతలు సుదీర్ఘంగా చర్చించారు. స్వేచ్ఛాయుతమైన, నియమ నిబంధనలతో కూడిన ఇండో-పసిఫిక్ ప్రాంతం కోసం కలిసి పనిచేయాలని ఇరు దేశాల అధినేతలు నిర్ణయించారు.

# ఎస్ఐఆర్ నిలిపేయండి.. సుప్రీంకోర్టుకు విపక్షాల వినతి

దేశ ఎన్నికల ప్రక్రియపై తీవ్ర ఆందోళనలు వ్యక్తం చేస్తూ విపక్షాలు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికి లేఖ రాశాయి. ఓటరు జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను వెంటనే నిలిపివేయాలని కోరాయి. ప్రజాస్వామ్య వ్యవస్థకు ముప్పు ఏర్పడిందని ఆరోపించాయి. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీతో పాటు 23 మంది విపక్ష నేతలు ఈ లేఖపై సంతకం చేశారు. ఎన్నికల ప్రక్రియలో ప్రజల అసలు తీర్పు ప్రతిబింబించడం లేదని ఆరోపించారు. స్వేచ్ఛాయుత, నిష్పక్షపాత ఎన్నికల సూత్రాలు దెబ్బతింటున్నాయని పేర్కొన్నారు. ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ప్రక్రియ రాజకీయ ఉద్దేశాలతో జరుగుతోందని విపక్షాలు ఆరోపించాయి. సరైన పత్రాలు లేని పేదలు, దళితులు, ఆదివాసీలు, మైనారిటీల ఓటు హక్కు ప్రమాదంలో పడుతోందని పేర్కొన్నాయి. లక్షలాది మంది నిజమైన ఓటర్లు జాబితాల నుంచి తొలగింపునకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశాయి. పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల సమయంలో 27 లక్షల మంది ఓటర్ల పేర్లు తొలగించారని లేఖలో పేర్కొన్నారు. 'లాజికల్ డిస్‌క్రిపెన్సీస్' పేరుతో ఈ తొలగింపులు జరిగాయని తెలిపారు. ఒక న్యాయ ట్రైబ్యునల్ పరిశీలించిన 1,777 కేసుల్లో 1,717 తొలగింపులు తప్పుగా జరిగాయని గుర్తించినట్లు వెల్లడించారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలపై కూడా ప్రజల్లో అనుమానాలు పెరుగుతున్నాయని విపక్షాలు తెలిపాయి. అవసరమైతే బ్యాలెట్ పేపర్ విధానాన్ని తిరిగి పరిశీలించాలని సూచించాయి. దీనిపై విస్తృత ప్రజా చర్చ జరగాలని కోరాయి. సీబీఐ, ఈడీ, ఎన్ఐఏ వంటి కేంద్ర దర్యాప్తు సంస్థలను విపక్షాలపై రాజకీయ అస్త్రాలుగా ఉపయోగిస్తున్నారని ఆరోపించాయి. ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేసేలా వ్యవస్థలను వినియోగిస్తున్నారని పేర్కొన్నాయి. రాజ్యాంగ పరిరక్షణ బాధ్యత సుప్రీంకోర్టుదేనని లేఖలో పేర్కొన్నారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు తక్షణ జోక్యం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

# 'ఇదేం పాకిస్థాన్ కాదు': కానిస్టేబుల్ వ్యాఖ్యలపై విచారణ

బాధిత కుటుంబ సభ్యులు అందించిన ఫిర్యాదు ప్రకారం, ఒక మహిళ, ఆమె కుమారుడు తమ మోటార్‌సైకిల్‌ను బారికేడ్ల వెనుక ఇతర వాహనాలతో పాటు పార్క్ చేశారు. వారు తిరిగి వచ్చిన తర్వాత బారికేడ్లను తొలగించాలని ట్రాఫిక్ కానిస్టేబుల్ జె. మల్లేశంను కోరగా, ఆయన అందుకు నిరాకరించారు. ఈ క్రమంలో కానిస్టేబుల్ దురుసుగా ప్రవర్తిస్తూ, "మీకు నచ్చిన చోట వాహనాలు పార్క్ చేయడానికి ఇదేమీ పాకిస్థాన్, ఆఫ్ఘనిస్థాన్ కాదు" అని అనుచిత వ్యాఖ్యలు చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ఘటనపై సైబరాబాద్ ట్రాఫిక్ డీసీపీ సాయి మనోహర్ స్పందిస్తూ, సదరు కానిస్టేబుల్‌పై అంతర్గత విచారణ ప్రారంభించామని, విచారణ పూర్తయిన తర్వాత నివేదిక ఆధారంగా తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. కాగా, వివాదం జరుగుతున్న సమయంలో కానిస్టేబుల్ తన వ్యక్తిగత ఫోన్‌లో సంభాషణను రికార్డు చేశాడని బాధితుడు సమీర్ తన ఫిర్యాదులో వెల్లడించారు.

## అప్పులతో తెలంగాణను సర్వనాశనం చేశారు..

సచివాలయంలో మీడియాతో మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం తీసుకున్న అప్పులు, ఆర్థిక వ్యవహారాలపై వివరాలు వెల్లడించారు. తమ తప్పులను కప్పిపుచ్చుకునేందుకే కేటీఆర్, హరీశ్ రావు ఎదురుదాడి చేస్తున్నారని విమర్శించారు. బీఆర్ఎస్ పాలనలో మొత్తం రూ.8.21 లక్షల కోట్ల అప్పులు చేసినట్లు భట్టి తెలిపారు. ఇందులో చెల్లించకుండా వదిలేసిన బకాయిలు కూడా ఉన్నాయని చెప్పారు. పదేళ్ల పాలన అబద్ధాల పునాదులపై సాగిందని విమర్శించారు. ఈ భారీ అప్పులపై మాజీ సీఎం కేసీఆర్ ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వ అప్పుల కారణంగా రెండున్నరేళ్లలో అసలు, వడ్డీలు కలిపి రూ.2,08,061 కోట్లు చెల్లించాల్సి వచ్చిందని భట్టి చెప్పారు. అయినప్పటికీ సంక్షేమ పథకాలను ఆపలేదన్నారు. అధిక వడ్డీ అప్పులను రీస్ట్రక్చరింగ్ చేయడం వల్ల వార్షిక వడ్డీ భారం రూ.34 వేల కోట్ల నుంచి రూ.11 వేల కోట్లకు తగ్గిందని వివరించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లలో సింగరేణిని సంక్షోభంలోకి నెట్టిందని భట్టి ఆరోపించారు. కొత్త కోల్ బ్లాకులు తీసుకురాలేదని విమర్శించారు. బొగ్గు మాయం ఆరోపణలపై ఇప్పటికే సింగరేణి విజిలెన్స్ విచారణకు ఆదేశాలు ఇచ్చామని చెప్పారు. కొత్త కోల్ బ్లాకుల కోసం కేంద్రంతో చర్చలు కొనసాగుతున్నాయని తెలిపారు.

## అప్పుల లెక్కల్లో పొంతన లేదు..

ఈ సందర్భంగా హరీశ్ రావు మాట్లాడుతూ.. తెలంగాణ ఏర్పడిన తర్వాత రాష్ట్రం చేసిన అప్పు రూ. 1,77,058 కోట్లు అని మంత్రి జూపల్లి కృష్ణారావు స్వయంగా తనకు లేఖ రాశారని తెలిపారు. అయితే, ఇదే అంశంపై నాలుగు నెలల క్రితం అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రం చేసిన అప్పు రూ. 3,45,294 కోట్లు అని చెప్పారని ఆయన గుర్తుచేశారు. ఒకే ప్రభుత్వంలోని మంత్రి ఒక లెక్క, ముఖ్యమంత్రి మరో లెక్క చెప్పడం గందరగోళానికి దారితీస్తోందని హరీశ్ రావు అన్నారు. అప్పుల విషయంలో ప్రభుత్వ పెద్దలు పరస్పర విరుద్ధ ప్రకటనలు చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆయన మండిపడ్డారు. ఈ లెక్కల్లో ఏది నిజమో ప్రభుత్వం స్పష్టం చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

## క్రిస్టియన్ మైనారిటీలకు శుభవార్త..

రాష్ట్రంలోని క్రిస్టియన్ మైనారిటీల సంక్షేమ పథకాల కోసం ప్రభుత్వం ఆన్‌లైన్ దరఖాస్తులను ప్రారంభించింది. ఈ మేరకు మంత్రి మహమ్మద్ అజారుద్దీన్ ఓబీఎంఎంఎస్ (ాదీవీమీ) పోర్టల్‌ను ప్రారంభించారు. అర్హులైన క్రిస్టియన్ మైనారిటీ అభ్యర్థులు ఈ పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వం సూచించింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. కుట్టు మిషన్, పెట్టీ బిజినెస్, బైక్, ఈ-బైక్ వంటి స్వయం ఉపాధి పథకాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. జూలై 3 నుంచి జూలై 18 సాయంత్రం 5 గంటల వరకు ఆన్‌లైన్‌లో మాత్రమే దరఖాస్తులను స్వీకరిస్తామని వెల్లడించారు. మహిళలు, యువత స్వయం ఉపాధి సాధించి ఆర్థికంగా ఎదగాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఈ పథకాలను అమలు చేస్తోందని మంత్రి పేర్కొన్నారు. లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా ఉండేలా ాదీవీమీ వ్యవస్థను రూపొందించినట్లు మంత్రి తెలిపారు.

## ఇన్నాళ్లూ ఖమేనీ భౌతిక కాయాన్ని ఎలా భద్రపరిచారో తెలుసా?

ఇరాన్ అత్యున్నత నేత అయతొల్లా అలీ ఖమేనీ మరణించిన నాలుగు నెలల తర్వాత ఆయన అంత్యక్రియల ప్రక్రియ ప్రారంభమైంది. అమెరికా-ఇజ్రాయెల్ దాడుల కారణంగా ఫిబ్రవరి 28న ఆయన కన్నుమూయగా, భద్రతా కారణాల దృష్ట్యా ఇప్పటి వరకు పార్థివ దేహాన్ని కోల్డ్ స్టోరేజ్‌లో భద్రపరిచారు. తాజాగా కాల్పుల విరమణ ఒప్పందం అమల్లోకి రావడంతో, వారం రోజుల పాటు సాగే ఈ అంతిమ యాత్ర కోసం ఇరాన్ ప్రభుత్వం భారీ ఏర్పాట్లు చేసింది. జూలై 9న ఆయన స్వస్థలమైన మషద్‌లో ఖననం నిర్వహించనున్నారు. ఖమేనీ శవపేటిక శుక్రవారం నాటికి టెహ్రాన్‌లోని గ్రాండ్ మొసల్లా ప్రార్థనా సముదాయానికి చేరుకుంది. మూడు రోజుల పాటు ఇక్కడ ప్రజలు, ఉన్నతాధికారులు, సైనిక సిబ్బంది మరియు విదేశీ ప్రతినిధుల సందర్శనార్థం భౌతికకాయాన్ని ఉంచుతారు. ఆ తర్వాత పవిత్ర నగరం ఖోమ్‌లోనూ, ఇరాక్‌లోని నజాఫ్, కర్బలాల్లోనూ సంతాప కార్యక్రమాలు నిర్వహించి, చివరగా జూలై 9న మషద్‌లోని ఇమామ్ రెజా పుణ్యక్షేత్రంలో అంత్యక్రియలు పూర్తి చేస్తారు. ఈ కార్యక్రమాల్లో కోట్లాది మంది పాల్గొంటారని అధికారులు అంచనా వేస్తున్నారు. ఇస్లామిక్ సంప్రదాయాల ప్రకారం మరణించిన వారి శవాన్ని 24 గంటలలోపే ఖననం చేయాలి, అలాగే రసాయనాలతో ఎంబామింగ్ చేయడం కూడా నిషేధం. అయితే, ప్రస్తుత యుద్ధ పరిస్థితుల నేపథ్యంలో ఇరాన్ అధినేత ఖమేనీ మృతదేహం విషయంలో మినహాయింపు తీసుకున్నారు. ఆయన పార్థివదేహాన్ని, ఆయన కుటుంబ సభ్యుల మృతదేహాలతో పాటు ఫోరెన్సిక్ మార్చురీలోని రిఫ్రిజిరేటెడ్ కోల్డ్ స్టోరేజ్‌లో (ఫ్రీజింగ్) భద్రపరిచారు.

## ప్రక్షాళన దిశగా బీజేపీ జాతీయ కార్యవర్గం.. అమిత్ షాతో అధ్యక్షుడు నితిన్ నబిన్ కీలక భేటీ..

భారతీయ జనతా పార్టీ కేంద్ర సంస్థాగత వ్యవస్థలో కీలక మార్పులు చోటుచేసుకునే సూచనలు కనిపిస్తున్నాయి. పార్టీ కొత్త కేంద్ర బృందం ఏర్పాటు, జాతీయ కార్యవర్గ పునర్వ్యవస్థీకరణ, సంస్థాగత బాధ్యతల కేటాయింపు వంటి అంశాలపై చర్చించేందుకు బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ గురువారం (జూన్ 02) కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో కీలక సమావేశం నిర్వహించారు. ఈ భేటీ రాజకీయ వర్గాల్లో ప్రాధాన్యత సంతరించుకుంది భారతీయ జనతా పార్టీ కేంద్ర సంస్థాగత వ్యవస్థలో కీలక మార్పులు చోటుచేసుకునే సూచనలు కనిపిస్తున్నాయి. పార్టీ కొత్త కేంద్ర బృందం ఏర్పాటు, జాతీయ కార్యవర్గ పునర్వ్యవస్థీకరణ, సంస్థాగత బాధ్యతల కేటాయింపు వంటి అంశాలపై చర్చించేందుకు బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ గురువారం (జూన్ 02) కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో కీలక సమావేశం నిర్వహించారు. ఈ భేటీ రాజకీయ వర్గాల్లో ప్రాధాన్యత సంతరించుకుంది. పార్టీ వర్గాల సమాచారం ప్రకారం, అమిత్ షా నివాసంలో సుమారు మూడు గంటల పాటు ఈ సమావేశం కొనసాగింది. ఈ సమావేశానికి బీజేపీ ప్రధాన కార్యదర్శి (సంస్థాగత) బీఎల్ సంతోష్ కూడా హాజరయ్యారు. పార్టీ సంస్థాగత వ్యవహారాల్లో కీలక పాత్ర పోషిస్తున్న ఈ ముగ్గురు నేతల మధ్య జరిగిన చర్చల్లో కొత్త కేంద్ర బృందం రూపకల్పనతో పాటు భవిష్యత్ రాజకీయ వ్యూహాలపై కూడా సమగ్రంగా చర్చించినట్లు సమాచారం.


# సంపాదకీయం

## మరోసారి బ్యాంకుల కుదింపు తప్పదా?

దేశంలో పలువురు వ్యాపారవేత్తలు ఆరంభించిన ప్రైవేట్ బ్యాంకులు రెండు దశలుగా జాతీయం అయ్యాయి. అలా తమ ఆధీనంలోకి వచ్చిన 28 బ్యాంకులను కేంద్ర ప్రభుత్వం దశలవారీగా కుదిస్తూ వస్తోంది. 2008--2017 మధ్య స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో దాని 7 అనుబంధ బ్యాంకులు విలీనమయ్యాయి. 2018లో బ్యాంక్ ఆఫ్ బరోడాలో విజయా బ్యాంక్, దేనా బ్యాంక్ కలిసిపోయాయి. 2020లో పంజాబ్ నేషనల్ బ్యాంకులో రెండు, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో రెండు, కెనరా బ్యాంకులో ఒకటి, ఇండియన్ బ్యాంకులో ఒకటి చేర్చడంతో ఉన్న 28 బ్యాంకులు కూడా 12 అయ్యాయి. వందేళ్లకు పైగా ఉనికిలో ఉన్న బ్యాంకులు కూడా ఈ విలీన ప్రక్రియలో నామరూపాలు కోల్పోయాయి. ఆంధ్రా బ్యాంక్‌తో తెలుగువారికి ఓ ప్రాంతీయ అనుబంధం ఉండేది. యూనియన్ బ్యాంకులో ఆంధ్రా బ్యాంకును కలుపుతున్నప్పుడు తెలుగువారు బాధపడిపోయారు. ఈ కుదింపుల వల్ల ప్రధానంగా కేంద్ర ఆర్థిక శాఖపై నిర్వహణ భారం తగ్గుతుంది. ఒక ప్రాంతంలోని రెండు భిన్న బ్యాంకుల శాఖలు ఒక్కటైనపుడు సిబ్బంది, కిరాయి, రకరకాల బిల్లుల ఖర్చు సగానికి తగ్గిపోతుంది. దగ్గరలోని బ్యాంక్ మూసివేత జరిగినపుడు ఆ ప్రాంతంలోని ఖాతాదారులకు కొంత అసౌకర్యం కలిగే మాట నిజమే. అయితే బ్యాంకింగ్ సేవలన్నీ ఇప్పుడు ఆన్‌లైన్‌లో అందుబాటులోకి వచ్చినందువల్ల బ్రాంచ్ దూరమైన బాధ కొంత తీరవచ్చు. ఇదివరలో ఉన్నట్లు సర్వీస్ ఏరియా అప్రోచ్ విధానాన్ని ఎత్తివేయడం వల్ల ఏ బ్యాంకయినా ఏ ప్రాంతంలోనైనా అప్పులు ఇవ్వొచ్చు. భారీ లోన్ ప్రపోజల్స్ స్క్రూటినీ, శాంక్షన్ మొదలైన పనులు లోన్ హబ్‌లు చేస్తున్నందువల్ల శాఖలో పూర్తిస్థాయి అప్పుల విభాగం ఉండవలసిన అవసరం తగ్గింది. ప్రతి బ్యాంకూ పదేసి శాఖలకు ఒక లోన్ హబ్‌ను విడిగా ఏర్పాటు చేసుకొని సిబ్బంది, నిర్వహణ భారాన్ని తగ్గించుకుంటోంది. అవుట్ సోర్సింగ్ నుంచి లోన్ రికవరీ ఏజెంట్లను ఉపయోగించుకొనే విధానానికి ఆర్బీఐ అనుమతి ఉన్నందువల్ల కమిషన్‌పై మొండి బకాయిలను వసూలు చేసుకునే ప్రైవేట్ సైన్యాన్ని బ్యాంకులు వాడుకుంటున్నాయి. క్రెడిట్, డెబిట్ కార్డులు వచ్చాక ఒక్కొక్కరికీ నాలుగు బ్యాంకుల్లో ఖాతాలు అవసరమయ్యాయి. లాభదాయకతను బట్టి కస్టమర్లు క్షణాల్లో బ్యాంకులను మార్చేస్తున్నారు. ఒకప్పుడు డిపాజిట్లు, రుణాలపై ఆర్బీఐ వడ్డీ రేట్లను నిర్ణయించేది. ఇప్పుడంతా బ్యాంకుల ఇష్టమే. ఈ లెక్కన సంప్రదాయ బ్యాంకు విధానం నుంచి జాతీయ బ్యాంకులు ఎంతో దూరం జరిగిపోయాయి. అయితే ఈ విలీనమంతా ప్రభుత్వానికి మేలు జరిగే దిశలోనే జరిగిందని చెప్పాలి. కొన్ని బలహీన బ్యాంకులు ఈ విలీనం వల్ల బతికి బట్టకట్టాయి కూడా. అయితే ఈ చర్యలు ఉద్యోగ నియామకాలపై భారీగా ప్రభావం చూపాయి. గత అయిదేళ్ల కాలంలో బ్యాంకు ఉద్యోగుల హెచ్చు తగ్గుల వివరాలు కేంద్ర ఆర్థిక శాఖ సేకరించింది. దాని ప్రకారం 2021--25 మధ్యలో 12 బ్యాంకుల్లో కేవలం నాలుగింటిలో సిబ్బంది వందల్లో పెరగగా, మిగతా ఎనిమిదింటిలో మాత్రం వేలల్లో ఉద్యోగుల సంఖ్య తగ్గింది. ఒక్క ఎస్బీఐలోనే 10 వేల మంది తగ్గిపోయారు. ఈ అయిదేళ్ల కాలంలో బ్యాంకు ఉద్యోగుల సంఖ్య కేవలం 6500 పెరిగింది. సగానికి పైగా సీనియర్ ఉద్యోగులు ఆధునిక బ్యాంకింగ్ సిస్టమ్‌కు తగినట్లు లేరని కేంద్ర బ్యాంకింగ్ డివిజన్ తేల్చినా, కొత్త నియామకాలు లేవు. కంప్యూటరైజేషన్, కుదింపు వల్ల ఉన్న సిబ్బందే ఎక్కువ అనే పరిస్థితి ఏర్పడింది. ఎస్బీఐ యోనో వంటి డిజిటల్ బ్యాంకింగ్ యూనిట్లు సిబ్బంది రహితంగా పనిచేస్తున్నాయి. ఈ నేపథ్యంలో మరోసారి బ్యాంకుల కుదింపునకు కేంద్రం కమిటీ వేస్తున్నట్లు ఫైనాన్స్ పత్రికల్లో కథనాలు వస్తున్నాయి. ప్రస్తుతం ఉన్న 12 ప్రభుత్వరంగ బ్యాంకులను 4 లేదా 5 బ్యాంకులుగా మార్చాలనే ఆలోచన ప్రభుత్వానిది. యూనియన్ బ్యాంకులో బ్యాంక్ ఆఫ్ ఇండియాను కలిపేసే ఆలోచన ప్రభుత్వానికి ఉన్నట్లు ఈ జనవరిలోనే బయటపడింది. ఇదే దారిలో ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంక్, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, యూకో బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర, పంజాబ్ అండ్ సింధ్ బ్యాంకులను తగ్గించే ప్రణాళిక కూడా ప్రభుత్వం దగ్గర ఉంది. ప్రస్తుతం ప్రభుత్వరంగ బ్యాంకుల్లో 9 లక్షల ఉద్యోగులున్నారు. అందులో సగం మందితో బ్యాంకులు నడిచే రోజులు దగ్గరలోనే ఉన్నాయి. కుదింపుతో పాటు బ్యాంకుల్లో విదేశీ పెట్టుబడులకు ఉన్న క్యాప్‌ను 49 శాతానికి పెంచే అవకాశాలు కూడా ఉన్నాయి. పబ్లిక్ సెక్టార్ బ్యాంకుల్లో ఎఫ్‌డీఐ ప్రస్తుతం 20శాతం పరిమితిలో ఉంది. దానికి కూడా ప్రభుత్వ అనుమతి అవసరం. షేర్ హోల్డర్ ఓటింగ్‌లో మాత్రం 10శాతం లెక్కలోకి తీసుకుంటారు. అప్పుడే విధానపర నిర్ణయాలపై ప్రభుత్వానిది పైచేయిగా ఉంటుంది. బయటి వాటా పెరిగితే బ్యాంకులపై దాని ప్రభావం తప్పకుండా ఉంటుంది. దేశవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వరంగ బ్యాంకుల సంఖ్యను అయిదింటికి కుదించి, వాటిలోని 49శాతం వాటాను పెట్టుబడిదారులకు అమ్మేస్తే, ఆ పెత్తనం వారి స్వప్రయోజన మార్పులకు దారి తీస్తుంది. సుమారు అర్ధ శతాబ్దం క్రితం జాతీయం చేసిన బ్యాంకుల పగ్గాలు తిరిగి వ్యాపారవేత్తల చేతుల్లోకి వెళితే సామాన్యుడి ఆర్థిక వికాసానికి ఇక్కట్లు మొదలైనట్లే.

# నైతికతకు మతం సరిపోదా?









మానవజీవితంలో మతం పాత్ర గురించి ఘనంగా చెప్పి రాజకీయాలను దాని చుట్టూ తిప్పేవారికి సవాళ్లు బయటి నుంచి కంటే లోపల నుంచే ఎక్కువగా వస్తాయి. అయోధ్య రామాలయ నిధుల దుర్వినియోగ వ్యవహారమే ఇందుకు నిదర్శనం. దేశ రాజకీయాలను మత ఆలోచనలతో విపరీతంగా ప్రభావితం చేసిన రామాలయ ఉద్యమం చివరికి అవినీతిలో ఇంతగా చిక్కుకుపోతుందని ఎవరూ ఊహించలేదు. దశాబ్దాల ఆందోళనలు, వివాదాల అనంతరం సుప్రీంకోర్టు తీర్పుతో ఆలయ నిర్మాణానికి మార్గం సుగమమైన తర్వాత కేంద్ర ప్రభుత్వం అవినీతికి ఆస్కారం లేకుండా సమగ్ర ఏర్పాట్లు చేస్తుందని భక్తకోటి విశ్వసించింది. వందల వేలకోట్ల ఆదాయం వచ్చే ఆలయాల నిర్వహణపై కట్టుదిట్టమైన చట్టపరమైన ఏర్పాట్లు లేకపోతే పరిస్థితి ఏమవుతుందనటానికి రామాలయ వ్యవహారానికి మించిన ఉదాహరణ మరొకటి ఉండదు. ఆలయాలపై ప్రభుత్వాల పర్యవేక్షణ ఉండకూడదని వాదించే వారికి ఇప్పుడు ఎటూ పాలుపోవటం లేదు. రామాలయ నిధుల దుర్వినియోగంపై కొన్ని నెలలకైనా ఏదోవిధంగా దర్యాప్తు పూర్తి అవుతుంది. దోషులుగా తేలిన వారికి ఏదోరకమైన శిక్షలూ పడతాయి. అంతటితో ఈ సమస్య ముగిసిపోతుంది. కేంద్రంతో పాటు యూపీ ప్రభుత్వం కూడా చట్టపరంగా చేయగలిగినదంతా చేసి నైతిక ధర్మాన్ని నిలబెట్టామని గొప్పగా చెప్పుకోవచ్చు. కానీ నైతికధర్మం, నైతిక ప్రవర్తనలో మనం చాలా దిగజారిపోతున్నామని గుర్తించటానికి రామాలయ నిధుల దుర్వినియోగం ఒక సందర్భాన్ని సమకూర్చుతోంది. మతంతోనే మానవజీవితంలో నైతికత పుట్టలేదు. మనుషులు మనుగడకోసమే నైతిక నియమాలను ఏర్పరచుకున్నారు. రాతకోతలు తెలియని, మతగ్రంథాల్లేని వేల ఏళ్ల నాటి ఆదిమసమాజాల్లో కూడా మంచిచెడులను నిర్దేశించే నైతిక నియమాలు ఉన్నాయి. మతాలు పుట్టి వ్యవస్థీకృతం అయిన తర్వాత నైతిక నియమాలను దేవుళ్లే నిర్దేశించారనీ, వాటిని ఉల్లంఘించే వారిని ఇహలోకంలోనూ పరలోకంలోనూ కఠినంగా శిక్షిస్తారనే భావాలకు చాలా ప్రాధాన్యం వచ్చింది. ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొని హిందూమతం అవిచ్ఛిన్నంగా బలంగా కొనసాగుతోందని మనం ఎంతైనా చెప్పుకోవచ్చు. కానీ అది నైతికతనూ, చట్టబద్ధ నడవడినీ ప్రజల్లో నెలకొల్పేవిధంగా ప్రేరేపిస్తోందా? అంటే గట్టిగా చెప్పలేం. మతనమ్మకాలనూ విధులనూ నిష్ఠగా ఆచరించటానికీ రోజువారీ జీవితంలో నైతికప్రవర్తనకూ మధ్య లంకె కుదరటం లేదు. 1982లో ప్రముఖ రచయిత, చరిత్రకారుడు, పాత్రికేయుడైన కుష్వంత్ సింగ్ 'ఉయ్ ఇండియన్స్' అనే పుస్తకాన్ని రాశారు. అప్పటికే ఆయన మతానికీ నైతిక ప్రవర్తనకూ మధ్య సంబంధం ఎంత బలహీనంగా మారిపోయిందో స్పష్టంగా తెలిపారు. మతానికి కేంద్రంగా ఉండాల్సిన నైతికత ఆచరణలో తొలగిపోయిందనీ దాని స్థానంలో వట్టి ఆచారాలు, సంప్రదాయాలు మాత్రమే మిగిలిపోయాయనీ వ్యాఖ్యానించారు. కులవ్యవస్థలో ప్రజలు ఒదిగి ఉండటానికి, గోసంరక్షణలాంటి విషయాలకు ప్రాధాన్యం ఇవ్వటానికి మాత్రమే మతం పరిమితం అయిపోతోందనీ విమర్శించారు. పూజలు చేయటం, దేవాలయాలకు వెళ్లటం, ఉపవాసాలు పాటించటం, తీర్థయాత్రలకు తరలిపోవటం, శుభముహూర్తాలను ఆచరించటం కంటే నైతికవర్తనకు ఎక్కువగా మతం దోహదం చేయాలనీ, కానీ అదెక్కడా కనపడటం లేదని ఘాటుగా విమర్శించారు. మతానికీ నైతికతకూ ఉండాల్సిన సంబంధం గురించి కుష్వంత్‌సింగ్ ఒక్కరే చెప్పలేదు. ఆధునిక సామాజికశాస్త్రానికి ఆద్యుడుగా భావించే మాక్స్‌వెబర్ కూడా నైతికతకూ సమాజ అభివృద్ధికి మధ్య సంబంధాన్ని విశ్లేషించారు. శ్రామిక వృత్తులను పవిత్రమైనవిగా భావించటంతో పాటు కష్టపడి పనిచేయటాన్ని దేవుడికి సేవ చేసినట్లుగా పరిగణించటం, సమయపాలన, పొదుపు, ఒప్పందాలను గౌరవించటం లాంటివి ప్రొటెస్టంట్ మతంలో ప్రధాన నైతిక అంశాలుగా ఉన్నాయనీ, అవే పాశ్చాత్య దేశాల అభివృద్ధికి చోదకశక్తులుగా పనిచేశాయనీ వెబర్ సూత్రీకరించారు. దీంతో అందరూ ఏకీభవించకపోవచ్చు. కొన్ని ఆసియా దేశాల్లో కూడా ఇవి ఉన్నాయనీ వాదించొచ్చు. కానీ వృత్తులను తక్కువగా చూడటం, శ్రమచేసే వారిని హీనంగా పరిగణించటం మన సమాజంలో ఇప్పటికీ ఉంది. ఇదెంతగా గతంలో మన అభివృద్ధిని కుంగదీసిందో లోతుగా పరిశోధిస్తే గానీ పూర్తి నిజాలు తెలియవు. రాజ్యవంశాల ఘనతలను చెప్పుకోవటానికీ, ప్రజాస్వామ్యం మొదలుకుని అన్నిటికి మనమే ఆద్యులమని ప్రకటనలు చేయటానికీ చరిత్ర రచనను పరిమితం చేయాలని మనం గట్టిగా ప్రయత్నిస్తున్నాం. పాఠ్యపుస్తకాలను అటువంటి చరిత్రతో నింపటానికే కసరత్తులు జరుగుతున్నాయి. తమ శ్రమతో, నైపుణ్యంతో సమాజం నడవటానికి కారణమైన వారికంటే పైవర్గాలకు పెద్దపీటవేసి వాళ్లకే విగ్రహపూజలు చేయటం మనకు అలవాటు. అదిప్పుడు ఇంకా ఎక్కువవుతోంది. అనైతిక ప్రవర్తనలను కట్టడిచేసే పదునును మతం కోల్పోతున్న దృశ్యం మనకు అడుగడుగునా కనపడుతుంది. ప్రతి పాపానికీ పరిహారం ఉంటుందనే ఆలోచన నైతికతను నిలదొక్కుకోనీయదు. ఘోరాలనూ నేరాలనూ రకరకాల ప్రాయశ్చిత్తాలతో కడిగేసుకుందామనే వారి సంఖ్య విపరీతంగా పెరుగుతోంది. అందుకే మనం అవినీతిని తగ్గించలేక పోతున్నాం. మన చట్టాలు ఘనంగా ఉంటాయి. హీనంగా అమలవుతాయి. ప్రపంచ దేశాల్లోని అవినీతిని అంచనా వేసే 'ట్రాన్సపరన్సీ ఇంటర్‌నేషనల్' అంచనాల ప్రకారం మన దేశంలో నైతికత ఏ మాత్రం మెరుగవ్వటం లేదు. 2016లో భారత్ ర్యాంకు 79 ఉంటే 2025 నాటికి అది 91కి పెరిగింది. ఓటర్లకు డబ్బులను పంచటంలో మనం ఎవ్వరికీ అందనంత స్థాయిలోకి వెళ్లిపోతున్నాం. ఎన్నికలప్పుడు ఒక్కో కుటుంబానికి వేల రూపాయలు చెల్లించటం దక్షిణాది రాష్ట్రాల్లో సర్వసాధారణమైంది. కిందటి లోక్‌సభ ఎన్నికల్లో లక్ష నుంచి లక్షా ముప్పయి అయిదు వేల కోట్ల రూపాయలను ఖర్చుపెట్టినట్లు అంచనాలు ఉన్నాయి. ఇందులో అధికారికంగా, చట్టబద్ధంగా ఖర్చుపెట్టింది 10శాతం లోపుగానే ఉంటుంది. మిగతాదంతా అనైతికంగా ఖర్చుపెట్టిందే. ఏ ప్రజాస్వామ్య దేశంలోనూ ఇంతగా ఎన్నికలపై అక్రమ ధనప్రభావం లేదు. అవినీతి సర్వవ్యాప్తం అవ్వటంతో అక్కడక్కడా నీతిగా వ్యవహరించే ఉద్యోగులనూ, పద్ధతి ప్రకారం పన్నులుకట్టే వ్యాపారులనూ, పారిశ్రామికవేత్తలనూ అనుమాన దృష్టితో చూడటమే కాదు.. వాళ్లను అబద్ధాలకోరులుగా భావించటమూ జరుగుతోంది. నిజాయితీగా వ్యవహరించేవారు.. మేం అలా ఉన్నామని.. అవసరార్థం ఎక్కడైనా చెప్పుకోవటం కూడా ఇబ్బందిగా మారటం కంటే దురవస్థ మరొకటి ఉండదు. ట్రాన్సపరన్సీ ఇంటర్‌నేషనల్ లాంటివి పరిమిత సమాచారంతోనే అవినీతిపై ర్యాంకులు ఇస్తున్నాయి. అన్ని రంగాల్లో అవినీతినీ దానివల్ల పోగుపడిన నల్లధనాన్నీ అంచనా కట్టటం కూడా అంత తేలికగా వీలుకావటం లేదు. 2016లో ఆర్భాటంగా చేసిన నోట్ల రద్దు అవినీతిపై ఎలాంటి ప్రభావం చూపించలేదు. ఆర్థికవ్యవస్థను ఒడుదుడుకులకు గురిచేసి ప్రజలను ఇబ్బందుల పాలుచేయటం కంటే సాధించింది ఏమీ లేదు. 1985 నాటికే దేశంలో నల్లధనం జీడీపీ (దేశీయ స్థూల ఉత్పత్తి)లో 15 నుంచి 21శాతానికి సమానంగా ఉంటుందని అంచనాలు వచ్చాయి. 2000 నాటికి అది 23 నుంచి 26శాతానికి చేరుకుంది. ప్రముఖ ఆర్థికవేత్త అరుణ్‌కుమార్ అంచనాల ప్రకారం 2012--13 నాటికి అది జీడీపీలో 62శాతానికి సమానంగా ఉంది. అప్పుడు జీడీపీ రూ.93 లక్షల కోట్ల రూపాయలు. అంటే 57 లక్షల కోట్లు నల్లధనం రూపంలో ఉంది. 2025--26లో మన జీడీపీ రూ.323 లక్షల కోట్లు. అరుణ్‌కుమార్ అంచనాల ప్రకారం నల్లధనాన్ని లెక్కకడితే అది రూ.200 లక్షల కోట్లు అవుతుంది. నల్లధనం అంటే డబ్బురూపంలో ఉండేదే కాదు. నిజానికి డబ్బురూపంలో ఉండేది చాలా తక్కువ. భూములు, బంగారం, బినామీ ఆస్తులు, షెల్‌కంపెనీలు, విదేశాల్లోని ఆస్తులు లాంటి ఎన్నోరూపాల్లో అది ఉంటుంది. మతం నైతిక ప్రవర్తనకు తోడ్పడకపోతే జరిగే అనర్థం అంతా ఇంతాకాదు. సమాజంలో లౌకిక, హేతువాద, ఆధునికతత్వ భావాలున్నా, వాటి ఆధారంగా నైతిక ప్రవర్తనతో వ్యవహరించే వారి సంఖ్య చాలా స్వల్పం. మతనమ్మకాలే అత్యధికులను ప్రభావితం చేస్తున్నాయి. ఆ నమ్మకాల్లో నుంచి వచ్చే పాపపుణ్యాల వివేచనా, ధర్మాధర్మ విచక్షణ.. మన నైతికతను బలోపేతం చేయలేకపోతే ఆలయాలు, మసీదులు, చర్చిలు అవినీతికి ఆలవాలంగా మారిపోతాయి. అయోధ్య రామాలయంలో నిధులను మింగేసిన వారికి దైవభక్తి నిండుగా ఉన్నా పాపపుణ్యాలనూ నైతికతనూ వదిలేశారు. ఇప్పటి ప్రభుత్వాలు పోటీలుపడి గుడులు, గోశాల అభివృద్ధికి నిధులు ఖర్చుపెడుతున్నాయి. ఒకప్పుడు ప్రభుత్వ నిధులను మతకార్యక్రమాలకు వాడాలంటే ఒక బెదురు ఉండేది. ఇప్పుడదేమీ లేదు. పన్నుల నుంచి వచ్చే ఆదాయం నుంచి వందల కోట్లను అలవోకగా ఖర్చుపెట్టేస్తున్నారు. ఇతర మతాల వారూ మాకూ అలా భారీగా నిధులు కేటాయించాలని కోరితే ఏంచేస్తారో తెలియదు. అసలు లౌకిక రాజ్యాంగపాలనలో ఇలా ఖర్చుపెట్టటం సబబా? కాదా? అన్న ఆలోచన చేయటాన్నే పాలకులు మర్చిపోతున్నారు. కోర్టులూ వాటిని పట్టించుకోవటం లేదు. ఒకప్పుడు రాజులు, నవాబులు తాము తలచినదే తడవుగా ఆలయాలు, మసీదుల నిర్మాణాలకు పూనుకొనేవారు. ప్రజాస్వామ్యంలోనూ మళ్లీ ఆ పోకడలు కనపడుతున్నాయి. ధర్మార్థకామమోక్షాలను సమతూకంలో పాటించటం అనేది హిందూమతసారంగా చెప్పటాన్ని చాలా తరచుగా మనం వింటాం. అర్థం (ధనార్జన) కోసం నైతిక ధర్మాన్ని వదలివేయటం ఇప్పుడు తేలికగా జరిగిపోతోంది. నైతికతను పెంచే రీతిలో మతం ఎందుకు వ్యవహరించలేకపోతోందని ప్రశ్న వేసుకుని విరుగుడు చర్యలకు ఉపక్రమించకపోతే నష్టం చాలా ఎక్కువగా ఉంటుంది. అన్ని మతాల్లో మంచిని పెంచేవీ తుంచేవీ రెండూ ఉంటాయి. నైతిక ప్రవర్తనకు దోహదం చేయని వాటిని వదలివేయలేని అశక్తత చివరికి సమాజాన్ని కుంగదీస్తుంది. ఆర్థికాభివృద్ధిని మందగింపజేస్తుంది. మతం మహోన్నత శక్తిగా కొనసాగాలనుకునేవారు ఈ దిశగా ఆలోచించటం కనీస కర్తవ్యంగా పరిగణించాలి. నైతికతను పెంపొందించనిది అది మతమైనా, మరోతత్వమైనా ఎప్పటికీ మహోన్నతమైంది కాదు. మత ఉద్రేకాలతో ఓట్లను పొందటం తేలికే కావచ్చు. ఒక మత వర్గంపై ద్వేషం ఆత్మానందాన్ని ఇవ్వొచ్చు. కానీ నైతికతను పెంచేరీతిలో మతాన్ని మలచటమే అసలుసిసలైన సవాల్. ఆ శక్తి ఇప్పటి మతంలో లేకపోతే నైతికతను పెంచే కొత్త భావాలనైనా ఆహ్వానించాలి. మధ్యేమార్గం ఉందని అనుకోలేం! విశ్వాసాల పాటింపులో నిష్ఠత--నైతికవర్తనలో అనిష్ఠతను మించిన ప్రమాదం మరొకటి లేదు! ద్వంద్వ ప్రమాణాలతో విశ్వగురు పీఠాన్ని పొందలేం!

# ఆయిల్ పామ్ సాగు విస్తీర్ణం పెంపొందేలా కృషి చేయాలి

-కలెక్టర్ ఇలా త్రిపాఠి



హంసకలం వార్త

నిర్దేశిత లక్ష్యానికి అనుగుణంగా జిల్లాలో ఆయిల్ పామ్ సాగు విస్తీర్ణం పెంపొందేలా ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచించారు. క్షేత్రస్థాయిలో రైతులను ప్రోత్సహిస్తూ జిల్లాలో ఈ సీజన్ లో 2 వేల ఎకరాల విస్తీర్ణంలో ఆయిల్ పామ్ సాగు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని లక్ష్యంగా నిర్దేశించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ లో శు క్రవారం వ్యవసాయ, ఉద్యానవన శాఖల అధికారులతో, ఆయిల్ పామ్ నర్సరీని నిర్వహిస్తున్న ప్రీ-యునిక్ కంపెనీ ప్రతినిధులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఆయిల్ పామ్ సాగు పురోగతిపై క్లస్టర్ల వారీగా వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ ఏర్పాటు కోసం నందిపేట మండలం లక్కంపల్లి సెజ్ ప్రాంతంలో గుర్తించిన స్థలం అనుకూలతపై చర్చించారు. భవిష్యత్తులో ఇదే ప్రాంతంలో రిఫైనరీ ఏర్పాటుకు సైతం స్థలం అందుబాటులో ఉండడం, పొరుగు జిల్లాలకు సెంటర్ పాయింట్ కావడంతో లక్కంపల్లి సెజ్ స్థలం ఫాక్టరీ ఏర్పాటుకు అవసరమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. అయితే ఆయిల్ పామ్ పంటను సేకరించే కలెక్షన్ సెంటర్లను రైతులకు అనువైన ప్రాంతాలలో అందుబాటులో ఉంచాలని ప్రీ-యునిక్ కంపెనీ ప్రతినిధులను ఆదేశించారు. ఎంతో లాభదాయకమైన ఆయిల్ పామ్ పంట సాగును చేపట్టి రైతులు ఆర్థిక అభ్యున్నతి సాధించాలన్నదే ప్రభుత్వ సంకల్పమని, దీనిని దృష్టిలో పెట్టుకొని జిల్లాలో రైతులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ఆయిల్ పామ్ సాగు చేపట్టేలా విస్తృత స్థాయిలో అవగాహన కల్పించాలని అన్నారు. ముఖ్యంగా మాక్లూర్, డొంకేశ్వర్, బాల్కొండ, ముప్కాల్, మెండోరా, సిరికొండ మండలాలపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలని, ఒక్కో మండలంలో కనీసం 100 ఎకరాల విస్తీర్ణానికి తగ్గకుండా ఆయిల్ పామ్ సాగు చేపట్టేలా చూడాలన్నారు. వరి సాగుకు ప్రత్యా మ్నాయంగా ఆయిల్ పామ్ సాగు దిశగా రైతులను ప్రోత్సహించాలని అన్నారు. క్షేత్రస్థాయిలో వ్యవసాయ శాఖ అధికారులు రైతులను కలుస్తూ, ఈ పంట వల్ల కలిగే ప్రయోజనాల గురించి అవగాహన కల్పించాలన్నారు. పై మండలాలలోని రైతు వేదికలలో అవగాహన సదస్సులు నిర్వహిస్తూ, ఆయిల్ పామ్ సాగును ప్రోత్సహించేందుకు ప్రభుత్వం అందిస్తున్న రాయితీలు, మద్దతు ధర, సుదీర్ఘ కాలం పాటు ఏటేటా సమకూరే రాబడి, అంతర పంటల సాగుకు గల అవకాశాలు తదితర అంశాలను వివరించాలని, ఆదర్శ రైతులు ఈ పంటను సాగు చేసేందుకు స్వచ్ఛందంగా ముందుకు వచ్చేలా అంకిత భావంతో కృషి చేయాలన్నారు. జిల్లాలో ఆయిల్ పామ్ సాగు కోసం సరిపడా మొక్కలు అందుబాటులో ఉండేలా చూడాలని ఆదేశించారు. ఎంతో లాభదాయకమైనందున ఈ పంట సాగు దిశగా రైతులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం పెద్ద ఎత్తున తోడ్పాటును అందిస్తోందని, ఈ అవకాశాన్ని జిల్లా రైతాంగం సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. సమావేశంలో ట్రైనీ కలెక్టర్ సురేష్, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి శ్రీనివాస్, వ్యవసాయ శాఖ అధికారి వీరస్వామి, ప్రీ యునిక్ కంపెనీ ఏరియా మేనేజర్ సాయి కిరణ్, ఉద్యానవన, వ్యవసాయ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఫిర్యాదుదారులకు సత్వర న్యాయం జరిగేటట్లు చర్యలు తీసుకోవాలి




హంసకలం వార్త

నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయి చైతన్య, మెండోర పోలీస్ స్టేషన్ ను సందర్శించారు. ఈ సందర్భంగా వివిధ రకాల ఫైల్స్ ను క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించారు. పోలీస్ విభాగము నిర్విరామముగా నిర్వహిస్తున్న పనితీరును క్షుణ్ణంగా పరిశీలించారు. ప్రజల యొక్క భద్రత మరియు శాంతి భద్రతల పరిరక్షణ కోసం తీసుకోవలసిన చర్యలపై పలు సూచనలు చేశారు.మెండోర పి.ఎస్ పరిధిలోని రికార్డ్ లను పరిశీలిస్తూ , అండర్ ఇన్వెస్టిగేషన్ లో ఉన్న కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అండర్ ఇన్వెస్టిగేషన్ కేసుల చేదనకు ప్రత్యేక ప్లాన్ ఆఫ్ యాక్షన్ ఉండాలని , ప్రతి కేసులో నాణ్యమైన , ఇన్వెస్టిగేషన్ చేయాలని సబ్ ఇన్స్పెక్టర్ కు సూచనలు చేశారు. ఈ పోలీస్ స్టేషన్ పరిధిలో సైబర్ నేరాల జరుగుతున్నాయని , సైబర్ క్రైమ్స్ గురించి వివిధ పాఠశాలలు , కళాశాలలో మరియు సోషల్ మీడియా ద్వారా అవగాహన కల్పించాలని సూచించారు. పోలీస్ స్టేషన్ పరిధిలోని అన్ని గ్రామాలలో విలేజ్ పోలీస్ ఆఫీసర్ గా విధులు నిర్వహిస్తూ ప్రజలతో మమేకమై గ్రామాలలో ఉన్నటువంటి సమస్యలను పరిష్కరించే దిశగా ప్రతి ఒక్కరు కృషి చేసి , అట్టి గ్రామాలలో ఉన్నటువంటి సమాచారము తమపై స్థాయి అధికారులకు ఎల్లప్పుడూ చేరవేయాలి అన్నారు. పోలీస్ స్టేషన్ సరిహద్దులో నిర్మల్ , మెట్ పల్లి ఉన్నందున వాహనాల రాకపోకలపై ఎల్లప్పుడూ నిఘ వ్యవస్థ ఏర్పాటు చేయాలని అన్నారు. ప్రతి రోజు ట్రాఫిక్ సమస్య అధిగమించడానికి ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్ ఎన్ఫోర్స్మెంట్ చేయాలని సూచించారు. అదేవిధంగా రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రజలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని పలు సూచనలు చేశారు. సులభ మార్గంలో అధిక డబ్బులు సంపాధించాలనే అత్యాశతో యువత ఆన్లైన్ బెట్టింగ్స్ ఆన్లైన్ గేమ్స్ ఆడుతూ, సైబర్ మోసగాళ్ళ చేతిలో చిక్కి డబ్బులు కోల్పోతూ అప్పులు చేసి, చేసిన అప్పులను తీర్చలేక తనువును చాలిస్తున్నారని అన్నారు. గేమింగ్ యాప్ ల పట్ల అప్రమత్తంగా ఉండాలని ప్రజలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు.పోలీస్ స్టేషన్ పరిధిలోని యువత డ్రగ్స్ బారిన పడకుండా అనునిత్యం అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని మరియు అన్ని గ్రామాలలో ప్రజలను డ్రగ్స్ బారిన పడకుండా చైతన్యవంతులను చేయాలని సూచించారు.అనంతరం సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడుతూ అధికారులు మరియు సిబ్బంది 24*7 తమ హెడ్ క్వార్టర్స్ లో అందుబాటులో ఉండాలని , దూర ప్రాంతాల నుండి ప్రయాణాలకు దూరంగా ఉండాలని , సిబ్బంది ప్రతి ఆరు నెలలకు ఒకసారి తమ హెల్త్ చెకప్ చేయించుకోవాలని, ముఖ్యంగా బైక్ నడిపేటప్పుడు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని అన్నారు. ట్రాఫిక్ రూల్స్ ను పాటిస్తూ ఇతరులకు ఆదర్శంగా ఉండాలని సూచించారు.ఈ సందర్భంగా ఆర్మూర్ రూరల్ సీఐ జాన్ రెడ్డి , మెండోర ఎస్సై జె. సుహాసిని మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# ఆంధ్ర టూ తెలంగాణ.... ఇసుక అక్రమ రవాణా

-మూడు లారీలు, ఎస్కార్ట్ వాహనం సీజ్ చేసిన వైరా పోలీసులు ..

-ఐదుగురు వ్యక్తులపై కేసు నమోదు

-నలుగురు వ్యక్తుల అరెస్ట్ ..



హంసకలం వార్త

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి తెలంగాణకు అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న మూడు లారీలతో పాటు, ఓ లారీకి ఎస్కార్ట్ వాహనంగా ఉన్న కారును వైరా పోలీసులు గురువారం రాత్రి పట్టుకొని సీజ్ చేశారు. ఈ అక్రమ వ్యాపారాన్ని నిర్వహిస్తున్న ఐదుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసి నలుగురు వ్యక్తులను అరెస్టు చేశారు. అరెస్ట్ అయిన నలుగురు వ్యక్తులను మధిర కోర్టులో రిమాండ్ కు పంపారు. ఈ అక్రమ వ్యాపారం చేస్తున్న వారు పోలీసుల తనిఖీల నుంచి తప్పించుకునేందుకు నిరంతరం లారీలు, ఎస్కార్ట్ వాహనం రిజిస్ట్రేషన్ నెంబర్లు మార్చేందుకు వీరి వద్ద ఉన్న రేడియం స్టిక్కర్లు సైతం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వైరా ఎస్ఐ తెలిపిన వివరాలు ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు ఇసుక రీచ్ నుంచి హైదరాబాద్ కు నిరంతరం ఇసుక అక్రమ రవాణా జరుగుతుంది. దీంతో గురువారం సాయంత్రం వైరా ఎస్ఐ పుష్పాల రామారావు ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది సోమవారం గ్రామ సమీపంలో ఉన్న గ్రీన్ ఫీల్డ్ హైవే ఎగ్జిట్ రోడ్డు వద్ద వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖిలో కొవ్వూరు నుంచి హైదరాబాద్ కు ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న మూడు లారీలను, ఎస్కార్ట్ గా ఉన్న ఒక స్విఫ్ట్ డిజైర్ కారును పోలీసులు పట్టుకొని సీజ్ చేశారు. అంతేకాకుండా పోలీసుల తనిఖీల నుంచి తప్పించుకునేందుకు లారీలు, ఎస్కార్ట్ గా ఉన్న కారు నెంబర్లను నిరంతరం మార్చేందుకు ఉపయోగించే రేడియం స్టిక్కర్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ అక్రమ రవాణాకు పాల్పడుతున్న నల్గొండ జిల్లాకు చెందిన లారీ యజమానులు, డ్రైవర్లు ఇస్లావత్ భిక్షు, ముక్కుమాల యాదయ్య, దామ సైదులు, వాంకుడోత్ లింగా నాయక్, బచ్చుబోయిన యాదయ్యలపై వైరా పోలీసులు కేసు నమోదు చేశారు. వీరిలో బచ్చుబోయిన యాదయ్య పరారీలో ఉండగా మిగిలిన నలుగురిని అరెస్టు చేసి మధిర కోర్టులో రిమాండ్ కు పంపారు. ఈ సందర్భంగా ఎస్సై పుష్పాల రామారావు మాట్లాడుతూ అనుమతు లేకుండా అక్రమంగా ఇసుక రవాణా చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రధానంగా ఆంధ్రప్రదేశ్ నుంచి ఇసుక అక్రమ రవాణాపై నిరంతరం నిఘా ఉంచుతామని స్పష్టం చేశారు. ఇసుక అక్రమ రవాణా సమాచారాన్ని ప్రజలు పోలీసులకు అందించాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని స్పష్టం చేశారు. ఈ తనిఖీల్లో ఎస్ఐ పవన్ కుమార్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# అడవులే భవిష్యత్ తరాలకు జీవనాధారం

-అటవీ సంరక్షణ ప్రతి పౌరుడి బాధ్యత

-పర్యావరణ పరిరక్షణలో యువత ముందుండాలి

-తెలంగాణ విశ్రాంత ప్రధాన అటవీ సంరక్షణ అధికారి ప్రశాంత్ కుమార్




హంసకలం వార్త

భూమిపై జీవజాల మనుగడకు అడవులే మూలాధారమని, పర్యావరణ సమతుల్యతను కాపాడడంలో అటవీ సంపద కీలక పాత్ర పోషిస్తుందని తెలంగాణ విశ్రాంత ప్రధాన అటవీ సంరక్షణ అధికారి ప్రశాంత్ కుమార్ జా అన్నారు. అడవులను పరిరక్షించడం ప్రభుత్వాల బాధ్యత మాత్రమే కాకుండా ప్రతి పౌరుడి సామాజిక బాధ్యతగా భావించాలని ఆయన పిలుపునిచ్చారు. రంగారెడ్డి జిల్లా కడ్తాల్ మండలం అన్మాస్‌పల్లి ఎర్త్ సెంటర్‌లో డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ మరియు కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన యంగ్ ఎర్త్ లీడర్స్ రెండు రోజుల శిక్షణ ప్రారంభ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ, వాతావరణ మార్పులు, పెరుగుతున్న కాలుష్యం, భూగర్భ జలాల క్షీణత వంటి సమస్యలకు అటవీ నిర్మూలనే ప్రధాన కారణాల్లో ఒకటని పేర్కొన్నారు. భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన గాలి, పరిశుభ్రమైన నీరు, ఆరోగ్యకరమైన ప్రకృతిని అందించాలంటే అడవుల సంరక్షణకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యత నిర్వర్తించాలని సూచించారు.పర్యావరణ పరిరక్షణ అనేది కేవలం ఒక కార్యక్రమం కాదని, అది ప్రతి ఒక్కరి జీవన విధానంలో భాగం కావాలని ఆయన అన్నారు. ప్రతి వ్యక్తి కనీసం ఒక మొక్కను నాటి దానిని సంరక్షిస్తేనే హరితభారత లక్ష్యం సాకారమవుతుందని పేర్కొన్నారు. విద్యార్థులు, యువత, మహిళలు పర్యావరణ పరిరక్షణలో చురుకైన పాత్ర పోషించాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా సీజీఆర్ అధ్యక్షురాలు లీలా లక్ష్మారెడ్డి మాట్లాడుతూ, మనిషి మనుగడలో ప్రతిదశ లో ప్రకృతి సేవలు అవసరమని అందుకోసం ప్రకృతిని సంరక్షించాలని అన్నారు. కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ ఫౌండర్ అండ్ చైర్మన్ లక్ష్మారెడ్డి మాట్లాడుతూ పర్యావరణ అనుకూల జీవన విధానాన్ని అలవర్చుకోవాలని అన్నారు .రంగారెడ్డి జిల్లా డీఎస్ఓ శ్రీనివాసరావు మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణను విద్యా వ్యవస్థలో భాగంగా తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. చిన్నప్పటి నుంచే ప్రకృతి పట్ల ప్రేమ, చెట్ల సంరక్షణపై అవగాహన కల్పిస్తే సమాజంలో మంచి మార్పు తీసుకురావచ్చని అభిప్రాయపడ్డారు. ఈ శిక్షణ కార్యక్రమంలో పర్యావరణ పరిరక్షణ, జీవవైవిధ్య సంరక్షణ, చెట్ల పెంపకం, వాతావరణ మార్పులు, సహజ వనరుల పరిరక్షణ వంటి అంశాలపై నిపుణులు వివిధ సెషన్ల ద్వారా శిక్షణ అందించబోతున్నారు. ఈ శిక్షణ కార్యక్రమానికి రంగారెడ్డి జిల్లాలోని ఎంపిక చేసిన 20 ప్రభుత్వ పాఠశాల నుండి విద్యార్థులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు..ఈ కార్యక్రమంలో వైఈఎల్పీ రాష్ట్ర కో.ఆర్డినేటర్ యనాల వెంకట్ రెడ్డి, పర్యావరణ శాస్త్రవేత్త ఉమామహేశ్వర్ రెడ్డి, ప్రొఫెసర్ వసంతలక్ష్మి, వైఈఎల్పీ ఇంచార్జ్ రజనీకాంత్, సీజీఆర్ సభ్యులు నగేష్,శంకరయ్య,హనుమంత్,రవి , ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్.ఐ.ఆర్ ప్రక్రియను సమర్ధవంతంగా నిర్వహించాలి

-బీ.ఎల్.వో.ల ఇంటింటి ఫారాల పంపిణీని పరిశీలించిన జిల్లా అదనపు కలెక్టర్ బి.ఎస్ లత

-గ్రామ సభల ద్వారా రీ-సర్వే పనులు వేగవంతం చేయాలి



హంసకలం వార్త

ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్.ఐ.ఆర్) కార్యక్రమాన్ని పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించి అర్హులైన ప్రతి ఓటరికి అవకాశం కల్పించాలని జిల్లా అదనపు కలెక్టర్ బి.ఎస్ లత అధికారులను ఆదేశించారు. మల్యాల మండలం సర్వాపూర్ గ్రామంలో బీఎల్‌వోలు ఇంటింటికి వెళ్లి ఎస్ఐఆర్ ఫారాలను పంపిణీ చేస్తున్న విధానాన్ని ఆకస్మికంగా పరిశీలించారు. బీఎల్‌వోలు ఓటర్లకు ఫారాల పంపిణీ, వివరాల నమోదు, అవగాహన కల్పన తదితర అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి పలు సూచనలు చేశారు. ప్రతి ఇంటిని తప్పనిసరిగా సందర్శించి అర్హులైన ఓటర్లకు ఫారాలు అందజేయాలని, ఓటర్ల సందేహాలను నివృత్తి చేస్తూ ఎస్ఐఆర్ ప్రక్రియపై పూర్తి అవగాహన కల్పించాలని సూచించారు. ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా నిబంధనల ప్రకారం పని చేయాలని అన్నారు. ఓటర్ల నుంచి అందిన ఫారాలను నిర్ణీత గడువులోగా స్వీకరించి, వివరాలను క్షుణ్ణంగా పరిశీలించాలని, అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలు కూడా ఈ ప్రక్రియలో చురుకుగా పాల్గొని సరైన సమాచారం అందించాలని కోరారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వము ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన భూసర్వే-రీ సర్వే సందర్భంగా మల్యాల మండలంలోని సర్వా పూర్ గ్రామంలో భూముల రీ-సర్వేకు సంభందించిన అవగాహణ సదస్సు ( గ్రామ సభ) నిర్వహించారు. భూమి రీ- సర్వే చేయుటలో చట్టం పరిదిలో వున్నా సర్వే సరిహద్దుల చట్టం1923 గురించి మరియు సర్వే కార్యాక్రమాల గురించి, సర్వే చేయు పని విదానాల గురించి ఇట్టి గ్రామ సభలో గ్రామ రైతులకు మరియు గ్రామ ప్రజలకు అవగాహణ కల్పించారు. ఈ కార్యక్రమంలో భూమి కొలతల ఏ. డి కిషన్ ప్రసాద్, తహసీల్దార్, సంబంధిత సిబ్బంది, బీఎల్‌వోలు మరియు తదితరులు పాల్గొన్నారు.

హంస కలం వార్త HAMSA KALAM VARTA
శనివారం 04 జూలై 2026

## మహిళా సంక్షేమం, సాధికారతకు కేంద్రం పెద్దపీట

-బండి సంజయ్

-మహిళల స్వావలంభనే సర్కార్ ధ్యేయం డాక్టర్ కవ్వంపల్లి



హంసకలం వార్త

మహిళా సంక్షేమం, ఆర్థికాభివృద్ధి సాధికారతకు మోదీ ప్రభుత్వం పెద్దపీట వేస్తున్నదని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ చెప్పారు. శుక్రవారం ఎల్ఎండీ కాలనీలోని మహిళా ప్రాంగణంలో కుట్టు మిషన్ల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా బండి సంజయ్ కుమార్ మాట్లాడుతూ మహిళా సంక్షేమానికి కేంద్రం పాటుపడుతోందని, ఉజ్వల పథకంలో భాగంగా 11 కోట్ల గ్యాస్ కనెక్షన్లు మహిళలకు ఇచ్చామని చెప్పారు. త్వరలో మహిళలకు 35 శాతం రిజర్వేషన్లు తీసుకు వస్తామన్నారు. స్వయం ఉపాధి అవకాశాల కల్పనలో భాగంగా మహిళలకు విడుతల వారీగా ఆటోలు ఇప్పించే ప్రయత్నం చేస్తున్నట్టు కేంద్ర మంత్రి చెప్పారు. గూడ్స్ ఆటోలు మన కరీంనగర్ లో మాత్రమే నడుస్తున్నాయని, వీటికి మరింత డిమాండ్ పెరిగే అవకాశాలున్నాయన్నారుఅన్నిరంగాల్లో మహిళలను ప్రోత్సహించే దిశగా ముందుకు సాగుతున్నామన్నారు. ఏ ప్రభుత్వమైనా ప్రజలకు మంచి చేయాలని చూస్తుందని, అయితే గత పాలకులు మాత్రం ఇందుకు భిన్నంగా పని చేశారని, గత పాలకులకు మహిళలను ప్రోత్సహించాలన్న సోయి లేకుండా పోయిందన్నారు. కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో 20 వేల మంది విద్యార్థులకు సైకిళ్లు కొని ఇవ్వడమే కాకుండా పదో తరగతి చదివిన విద్యార్థులకు పరీక్ష ఫీజులు కట్టిన విషయాన్ని బండి సంజయ్ కుమార్ గుర్తు చేశారు.

-మహిళల స్వావలంభనే సర్కార్ ధ్యేయం : డాక్టర్ కవ్వంపల్లి

ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ ఎవరిపై ఆధారపడకుండా స్వయం సమృద్ధి సాధించేలా మహిళలను తీర్చిదద్దడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. మహిళలను కోటీశ్వరులను చేయాలన్న సంకల్పంతో రేవంత్ రెడ్డి ముందుకు సాగుతున్నారన్నారు. మహిళలను కోటీశ్వరులను చేయాలనే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకున్నదని చెప్పారు. మహిళా సంఘాలకు రూ.10లక్షల రుణంతో పాటు ఇన్సూరెన్స్ కల్పిస్తున్నామని డాక్టర్ కవ్వంపల్లి చెప్పారు. మహిళల్లో కష్టపడే తత్వం మెండుగా ఉండటం వల్ల ప్రభుత్వ పథకాలతో వారు సత్ఫలితాలను సాధిస్తున్నారని చెప్పారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అనేక సంక్షేమ పథకాలు,కార్యక్రమాలన్నీ మహిళా ప్రాంగణం ద్వారా ప్రవేశపెట్టిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు.మహిళలను బలోపేతం చేసేలా కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అందిస్తున్న సహాయం, చేస్తున్న కృషి ఎంతో గొప్పదని డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ కొనియాడారు.

## ఇందిరా మహిళా శక్తితో ఆర్థిక ప్రగతి

-ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లతో ఎస్ హెచ్ జీ మహిళల ఉపాధికి మార్గం

-జిల్లా కలెక్టర్ గరిమ అగర్వాల్



హంసకలం వార్త

ఇందిరా మహిళా శక్తి యూనిట్లు మహిళా సంఘాల ఆర్థిక ప్రగతికి దోహదపడుతున్నాయని జిల్లా కలెక్టర్ గరిమ అగర్వాల్ తెలిపారు.ఇందిరా మహిళా శక్తి కింద తంగళ్ళపల్లి మండల కేంద్రంలో స్వయం సహాయక సంఘాల (ఎస్ హెచ్ జీ) మహిళలు వెంకటసాయి కోల్డ్ ప్రెస్ ఆయిల్ ఌ ఫ్లోర్ మిల్ యూనిట్,కోవిదా మిల్క్ పాయింట్ ఏర్పాటు చేసుకోగా,జిల్లా కలెక్టర్ గరిమ అగర్వాల్ శుక్రవారం ప్రారంభించారు.వాటి పని తీరు,ఉపాధి,ఆదాయం తదితర వివరాలను మహిళలను జిల్లా కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు.జిల్లా కలెక్టర్ గరిమ అగర్వాల్ మాట్లాడుతూ ఇందిరా మహిళా శక్తి కింద రెండు యూనిట్లు ప్రారంభించామని తెలిపారు.ఒక యూనిట్లో కోల్డ్ ప్రెస్సింగ్ ఆయిల్,పిండి గిర్ని,ఇతర దాదాపు ఆరు యంత్రాలు ఏర్పాటు చేశారని తెలిపారు.దాదాపు రూ. 11లక్షల 50వేలతో యూనిట్ ప్రారంభించారని వివరించారు.దీనికి పీ ఎం ఎఫ్ ఎం ఈ కింద రూ 3లక్షల50 వేల సబ్సిడీ అందుతుందని వెల్లడించారు.అలాగే మరో మహిళ డైరీ యూనిట్ ను ఏర్పాటు చేసుకున్నారని,దీనికి మహిళా సంఘాల నుంచి దాదాపు రూ.5 లక్షల రుణం ఇప్పించామని తెలిపారు.ఇక్కడ ఇతర డైరీ ఉత్పత్తులు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు.జిల్లాలో ఇలాంటి మరిన్ని యూనిట్లు ఏర్పాటు చేసేందుకు మహిళలు ముందుకు రావాలని పిలుపు నిచ్చారు.యూనిట్లు ఏర్పాటు చేయడంతో ఉపాధితోపాటు మహిళా సాధికారతకు దోహదం చేస్తుందని వివరించారు.నిన్న బ్యాంకర్ల సమావేశంలో ఇదే విషయంపై చర్చించి మహిళా సంఘాలకు రుణాలు ఇవ్వాలని ఆదేశాలు జారీ చేశామని తెలిపారు.జిల్లాలోని గ్రామీణ మహిళా,పురుష అభ్యర్థులకు ఉచిత రెసిడెన్షియల్ శిక్షణ సిరిసిల్ల జిల్లా కేంద్రంలో ఆర్ సేథ్(ఆర్ సిటీ) ఆద్వర్యంలో అందుబాటులో ఉందని వెల్లడించారు.శిక్షణను యువత సద్వినియోగం చేసుకోవాలని,ఆర్థికంగా రాణించేందుకు వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ గరిమ అగర్వాల్ పిలుపు నిచ్చారు.కార్యక్రమంలో డీఆర్డీఓ లక్ష్మీనారాయణ,లీడ్ డిస్ట్రిక్ మేనేజర్ మల్లికార్జున రావు,ఏఎంసీ వైస్ చైర్మెన్ నర్సింగం,ఇంచార్జి తహసీల్దార్ మురళి,ఇంచార్జి ఎంపీడీఓ రమేష్,ఎంపీఓ మీర్జా,సర్పంచ్ లక్ష్మీరాజం,తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ మంత్రులవి సవాళ్లు కావు... పలాయన సూత్రాలు

-కాంగ్రెస్ ప్రభుత్వంపై వేముల ఫైర్



హంసకలం వార్త

రాష్ట్రంలో జరిగిన సవాళ్ల తతంగంలో కాంగ్రెస్ మంత్రుల డొల్లతనం,వారి అసమర్థత ప్రజల ముందు బట్టబయలైందని, బీఆర్ఎస్ నాయకులకు సవాల్ విసిరిన కాంగ్రెస్ మంత్రులు చివరకు పోలీసులను అడ్డంపెట్టుకుని చర్చకు రాకుండా పారిపోయారని బాల్కొండ ఎమ్మెల్యే, మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు.తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వంపై, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రుల వైఖరిపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పరిస్థితి ప్రస్తుతం 'సై' సినిమాలో నటుడు వేణుమాధవ్ పోషించిన 'నల్లా బాలు' పాత్రలా మారిందని, సినిమాలో ఆ పాత్ర ఎంత బిల్డప్ ఇచ్చినా చివరకు హీరో చేతిలో తన్నులు తిని తుస్సుమన్నట్లుగానే.. నిన్న కేటీఆర్, హరీశ్ రావు దెబ్బకు రేవంత్ రెడ్డి అండ్ టీమ్ బిల్డప్ అంతా పటాపంచలైందని ప్రశాంత్ రెడ్డి ఎద్దేవా చేశారు. చర్చలంటూ సవాళ్లు విసిరిన కాంగ్రెస్ మంత్రులు చివరకు తోక ముడిచారని, కాంగ్రెస్ పార్టీ నిన్న స్వయంగా సెల్ఫ్ గోల్ కొట్టుకుందని, "ఆపరేషన్ సక్సెస్.. పేషెంట్ డెడ్" అన్నట్లుగా కాంగ్రెస్ పరిస్థితి తయారైందని వ్యాఖ్యానించారు. గత ఏడాది జూలై 8వ తేదీన ప్రెస్ క్లబ్‌కు చర్చకు రావాలంటూ కేటీఆర్ సవాల్‌ను స్వీకరించి మూడు గంటలు వేచి చూసినా రేవంత్ రెడ్డి రాలేదని, చివరకు ప్రెస్ క్లబ్‌ను కల్లు కాంపౌండ్‌తో పోల్చి పారిపోయారని దుయ్యబట్టారు. అలాగే 2018 ఎన్నికల్లో కొడంగల్‌లో గెలవకపోతే రాజకీయ సన్యాసం తీసుకుంటానని సవాల్ చేసి, ఓడిపోయిన మూడు నెలలకే మళ్లీ మల్కాజ్‌గిరి ఎంపీగా పోటీ చేశారని, మాట తప్పడం రేవంత్ రెడ్డికి వెన్నతో పెట్టిన విద్య అని విమర్శించారు. దేవుళ్ల మీద ఒట్లు వేసి లక్షల రూపాయల రుణమాఫీని ఇప్పటికీ సంపూర్ణంగా అమలు చేయకుండా రైతులను వంచించారని సవాళ్లు విసరడం, తీరా సమయం వచ్చాక తప్పించుకోవడం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కొత్తేమీ కాదని వేముల ఎద్దేవా చేసారు.హరీశ్ రావు, ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్‌లను చర్చకు రానీయకుండా వందలాది మంది పోలీసులను అడ్డుపెట్టి అక్రమంగా అరెస్ట్ చేయించడమే కాకుండా ఒక మాజీ మంత్రిని, అసెంబ్లీలో బీఆర్ఎస్ ఉపనేత అయిన హరీశ్ రావును డీసీఎం వ్యాన్‌లో పడేసి, నగరం అంతా తిప్పి కంచన్‌బాగ్ పోలీస్ స్టేషన్‌లో బంధించడం అత్యంత దారుణమన్నారు. అరెస్టుల సమయంలో హరీశ్ రావు స్వయంగా ముగ్గురు కాంగ్రెస్ మంత్రులకు ఫోన్ చేసినా ఎవరూ ఫోన్ ఎత్తలేదని, పోలీసుల వెనుక దాక్కుని పలాయనం చిత్తగించారని దుయ్యబట్టారు. ప్రజాస్వామ్యంలో వాదనతో గెలవలేనప్పుడే అధికారపక్షం పోలీసులను అడ్డం పెట్టుకుని ప్రతిపక్షాల గొంతు నొక్కుతుందని వేముల స్పష్టం చేశారు. నిన్నటి ఘటనతో కాంగ్రెస్ ప్రభుత్వ పరువు పూర్తిగా పోయిందని, ఆ డ్యామేజ్‌ను కంట్రోల్ చేయడానికి సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు కాంగ్రెస్ నేతలు నేడు ప్రెస్ మీట్లు పెట్టి అడ్డగోలుగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. సబ్జెక్ట్ లేనివారే ఇలాంటి డ్రామాలు ఆడుతారని, కాంగ్రెస్ మంత్రులకు సమాధానం చెప్పే దమ్ము, ధైర్యం లేవని వేముల ప్రశాంత్ రెడ్డి స్పష్టం చేశారు. తమ ప్రభుత్వ వైఫల్యాలను, అవినీతిని కప్పిపుచ్చుకోవడానికి మరియు ప్రజల దృష్టిని మళ్లించడానికే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఇతర మంత్రులు 'అప్పుల' పేరిట కొత్త డ్రామాలకు తెరలేపారని ఆయన విమర్శించారు. అభివృద్ధి, ఆర్థిక అంశాలపై చర్చకు రావాలంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విసిరిన సవాల్‌ను బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్వీకరించి చర్చకు సిద్ధమని స్పష్టం చేశారని ప్రశాంత్ రెడ్డి తెలిపారు. అయితే చర్చకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాకుండా మధ్యలో మంత్రి జూపల్లి దూరారని మండిపడ్డారు. తెలంగాణ భవన్, గన్‌పార్క్, ప్రెస్‌క్లబ్ అంటూ వేదికలు మారుస్తూ మంత్రి జూపల్లి వెనకడుగు వేశాడని ఎద్దేవా చేశారు. ఈ చర్చ కేవలం ముఖ్యమంత్రి మరియు కేటీఆర్ మధ్య జరగాలని, సంబంధం లేని మంత్రులు మధ్యలోకి వచ్చి జోకర్లలా మారవద్దని హితవు పలికారు.

# భావితరాల సంక్షేమం కోసం ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి సంరక్షించాలి

-జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్

-వనమహోత్సవంలో పెద్ద ఎత్తున మొక్కలను నాటాలి..

-పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత..

-వనమహోత్సవాన్ని పండుగలా నిర్వహించాలని పిలుపు..

-భావితరాల కోసం మొక్కలు నాటి, సంరక్షిస్తూ వాతావరణ మార్పులకు శాశ్వత పరిష్కారం..

-సత్తుపల్లి జేవీఆర్ కళాశాల నుంచి పాత సెంటర్ వరకు నిర్వహించి వనమహోత్సవ భారీ ర్యాలీలో పాల్గొన్న జిల్లా కలెక్టర్,ఎమ్మెల్యే..



హంసకలం వార్త

భావితరాల సంక్షేమం కోసం, పర్యావరణ పరిరక్షణను ప్రతి ఒక్కరూ తమ బాధ్యతగా భావించి మొక్కలను పెద్ద ఎత్తున నాటి సంరక్షించాలని జిల్లా కలెక్టర్ దివాకర్ టీఎస్ అన్నారు. శుక్రవారం ఆశా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో సత్తుపల్లి పట్టణంలో విద్యార్థులు, యువత, ప్రజలతో జేవీఆర్ కళాశాల మైదానంలో నిర్వహించిన వనమహోత్సవ సభలో నిర్వహించిన కార్యమానికి జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ ముఖ్య అతిథిగా హాజరై సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ తో కలిసి ప్రారంబించారు. ముందుగా విద్యార్థులతో కలిసి జిల్లా కలెక్టర్ మొక్కలు నాటారు. అనంతరం జేవీఆర్ కళాశాల నుంచి పాత సెంటర్ వరకు నిర్వహించిన ర్యాలీలో వారు పాల్గొన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని పర్యావరణ పరిరక్షణకు తమ సంఘీభావాన్ని తెలియజేశారు. జానపద కళాకారుల ప్రదర్శనలు ర్యాలీకి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ ఇంత భారీ స్థాయిలో, ఉత్సాహభరితంగా నిర్వహించిన వనమహోత్సవ కార్యక్రమంలో పాల్గొనడం తనకు ఉత్సాహం కలిగించిందని, ప్రజల భాగస్వామ్యం కలిగిన కార్యక్రమాన్ని చూస్తున్నానని సంతోషాన్ని వ్యక్త పరిచారు. కార్యక్రమం విజయవంతం కావడానికి కృషి చేసిన నిర్వాహకులకు, ప్రజలకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. వనమహోత్సవం అంటే కేవలం మొక్కలు నాటడం మాత్రమే కాదని, అది ఒక పండుగగా, సామాజిక బాధ్యతగా భావించాలని అన్నారు. దీపావళి, దసరా, సంక్రాంతి వంటి పండుగలను ఎలా ఆనందంగా జరుపుకుంటామో, అదే విధంగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటే కార్యక్రమాన్ని కూడా పండుగలా నిర్వహించా లని పిలుపునిచ్చారు. చరిత్రలో చక్రవర్తి అశోకుడు ఒక వృద్ధుడు మొక్కలు నాటుతున్న దృశ్యాన్ని చూసి, తన కోసం కాకుండా భావితరాల కోసం మొక్కలు నాటుతున్నానన్న ఆ వృద్ధుడి మాటలతో స్ఫూర్తి పొంది తన రాజ్యం అంతటా రహదారుల వెంట విస్తృతంగా మొక్కలు నాటించే కార్యక్రమాన్ని చేపట్టిన విషయాన్ని కలెక్టర్ గుర్తు చేశారు. భావితరాల సంక్షేమం కోసం ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి వాటిని సంరక్షించాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న వనమహోత్సవ కార్యక్రమం ద్వారా ప్రతి ఏడాది కోట్లాది మొక్కలు నాటుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాల ఫలితంగా రాష్ట్రంలో అటవీ విస్తీర్ణం గణనీయంగా పెరుగుతోందని పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా వాతావరణ మార్పుల ప్రభావం తీవ్రంగా కనిపిస్తోందని, యూరప్‌లోని జర్మనీ వంటి దేశాల్లో కూడా తీవ్ర ఉష్ణోగ్రతల కారణంగా రహదారులు దెబ్బతినడం, ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్న పరిస్థితులు కనిపిస్తున్నాయని చెప్పారు. ప్రకృతిని నిర్లక్ష్యం చేయడం, విచ్చలవిడిగా వనరులను వినియోగించడం వల్లే ఈ పరిస్థితులు ఏర్పడుతున్నాయని తెలిపారు. చెట్లు, పక్షులు, నేల, నీటి వనరులు, జీవ వైవిధ్యాన్ని కాపాడటం ద్వారా మాత్రమే భావితరాలకు ఆరోగ్యకరమైన భూమిని అందించగలమని కలెక్టర్ అన్నారు. ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్కను నాటి, అది పెద్ద చెట్టుగా ఎదిగే వరకు సంరక్షించాలని కలెక్టర్ పిలుపునిచ్చారు.

సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, మొక్కలు నాటడం మాత్రమే కాకుండా వాటిని సంరక్షించడమూ అంతే ముఖ్యమని అన్నారు. వనమహోత్సవం ఒక ప్రభుత్వ కార్యక్రమం మాత్రమే కాదని, భావితరాల భవిష్యత్తును కాపాడే సామాజిక ఉద్యమమని పేర్కొన్నారు. పర్యావరణ సమతుల్యతను కాపాడడంలో చెట్ల పాత్ర అత్యంత కీలకమని, పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, వాతావరణ మార్పులు, భూగర్భ జలాల తగ్గుదల వంటి సమస్యలకు మొక్కల పెంపకమే శాశ్వత పరిష్కారమని అన్నారు. మొక్కలు నాటడమే కాకుండా వాటిని సంరక్షించడం కూడా అంతే ముఖ్యమని, ప్రతి పౌరుడు తన ఇంటి వద్ద, విద్యాసంస్థల్లో, కార్యాలయాల్లో, ఖాళీ ప్రదేశాల్లో మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంపొందించాలని పిలుపునిచ్చారు. ఈ రోజు మనం నాటే ప్రతి మొక్క రేపటి తరాలకు అమూల్యమైన ఆస్తి అని, ప్రకృతిని కాపాడితేనే ప్రకృతిమనలను కాపాడుతుందని, పచ్చదనం పెరిగితేనే ఆరోగ్యకరమైన సమాజం, సురక్షితమైన భవిష్యత్తు సాధ్యమవుతుందని ఎమ్మెల్యే అన్నారు. సత్తుపల్లి నియోజకవర్గం విద్య, అభివృద్ధి, సామాజిక చైతన్యంలో ముందంజలో ఉందని, ఈ భారీ వనమహోత్సవ ర్యాలీ రాష్ట్ర చరిత్రలో ప్రత్యేక గుర్తింపును పొందుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, జిల్లా అటవీ అధికారి అనూజ్ అగర్వాల్, ఆశా స్వచ్ఛంద సేవా సంస్థ బాధ్యులు మట్టా దయనంద్, ప్రజాప్రతినిధులు, అధికారులు, పట్టణ ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

## చదువుకే పరిమితం కాకుండా,ఆధునిక సాంకేతిక శిక్షణలోని గిరిజన విద్యార్థులు రాణించాలని

-జిల్లా కలెక్టర్ రాజర్షిషా

హంసకలం వార్త

చదువుకే పరిమితం కాకుండా,ఆధునిక సాంకేతిక శిక్షణలోని గిరిజన విద్యార్థులు రాణించాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా పిలుపునిచ్చారు. శుక్రవారం ఉట్నూరులోని ప్రభుత్వ ఐటీఐ అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ లో "ప్రాజెక్ట్ ఎక్స్‌పో 2026" ప్రదర్శనను ఐటీడీఏ పీఓ మంద మకరంద్ తో కలిసి ఆయన రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం వారు విద్యార్థులు ఏర్పాటు చేసిన వివిధ స్టాళ్లను సందర్శించి,వారు రూపొందించిన వినూత్న సాంకేతిక ప్రాజెక్టులను ఆసక్తిగా పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ...గ్రామీణ గిరిజన ప్రాంత విద్యార్థులు ఇంతటి అద్భుతమైన సాంకేతిక నైపుణ్యాలను ప్రదర్శించడం అభినందనీయమన్నారు. నేటి ఆధునిక యుగంలో కేవలం చదువుకే పరిమితం కాకుండా, ఇలాంటి ప్రాజెక్టుల ద్వారా విద్యార్థులు సరికొత్త ఆవిష్కరణలకు నాంది పలకాలన్నారు. టాటా భాగస్వామ్యంతో ఏర్పాటు చేసిన ఈ సెంటర్ ద్వారా



లభిస్తున్న ఆధునిక శిక్షణను గిరిజన విద్యార్థులు పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఐటీడీఏ పీఓ మాట్లాడుతూ... యువత పారిశ్రామిక రంగానికి అవసరమైన నైపుణ్యాలను పెంపొందించుకుని, భవిష్యత్తులో ఉద్యోగాలు వెతకడమే కాకుండా ఇతరులకు ఉపాధి కల్పించే స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. విద్యార్థుల ఉన్నత చదువులకు ఐటీడీఏ తరఫున ఎల్లప్పుడూ పూర్తి సహకారం ఉంటుందని భరోసా ఇచ్చారు.అనంతరం ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు కలెక్టర్, పీఓ చేతుల మీదుగా ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ మోహన్ సింగ్, జిల్లా కార్మిక శాఖ అధికారి ముత్యం,ఐటీఐ ప్రిన్సిపాల్ శ్రీనివాస్, ఇతర అధికారులు, శిక్షకులు, అధ్యాపకులు, విద్యార్థులు,సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# భూ సర్వే ప్రక్రియలో రెవెన్యూ గ్రామాల హద్దుల నిర్ధారణతో సమస్యల పరిష్కారం

**-జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

హంసకలం వార్త

ప్రభుత్వ ఆదేశం ప్రకారం జిల్లాలో భూ సర్వే ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలని,రెవెన్యూ గ్రామాల హద్దుల నిర్ధారణతో సమస్యల పరిష్కారానికి వెసులుబాటు కలుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం జిల్లాలోని చెన్నూర్ మండలం కిష్టంపేట గ్రామంలో ఏర్పాటు చేసిన సమగ్ర భూ సర్వే అవగాహన సదస్సుకు మండల తహసిల్దార్ మల్లికార్జున్,మండల పరిషత్ అభివృద్ధి అధికారి మోహన్ లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ...భూభారతి రెవెన్యూ సదస్సులలో వచ్చిన భూ సంబంధిత దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి రికార్డులను చూసి పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ నేపథ్యంలో రికార్డులు, మోకా, పట్టాదారుల వివరాలు ఇతర అంశాలను పరిగణలోకి తీసుకొని ప్రభుత్వ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. మొదటగా గ్రామంలోని భూములకు సంబంధించి హద్దులు నిర్ధారించడం జరుగుతుందని, తద్వారా గ్రామానికి సంబంధించిన భూమి స్పష్టత వస్తుందని, ప్రభుత్వ భూములు సైతం నిర్ధారణ అవుతాయని తెలిపారు. పట్టా కలిగి ఉండి మోకాపై లేకపోవడం, మోకాపై ఉండి పట్టా కలిగి ఉండకపోవడం అంశాలపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని, ప్రభుత్వం భూములను ఆక్రమించినట్లయితే చర్యలు తీసుకుంటామని తెలిపారు. భూ సర్వే సమగ్రంగా నిర్వహించి మ్యాపింగ్ చేయడం జరుగుతుందని, ఈ క్రమంలో భూ సమస్యలు తలెత్తినట్లయితే న్యాయపరమైన చర్యలకు సులభతరమవుతుందని, మ్యాపింగ్ ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించేందుకు అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ చర్యలలో భాగంగా నిబంధనల ప్రకారం సంబంధిత వ్యక్తులకు నోటీసులు జారీ చేయడం జరుగుతుందని, న్యాయపరంగా రావలసిన భూమి అందుతుందని తెలిపారు. భూములలో కబ్జాదారుల జాబితా తయారు చేయడం జరుగుతుందని, పట్టా భూముల సర్వే అనంతరం రికార్డులను సరి చూసి సర్వే నెంబర్ల ప్రకారం హద్దుల నిర్ధారణ జరుగుతుందని, పట్టాలో ఒక సర్వే నెంబరు, మోకాలో ఒక సర్వే నెంబరు అంశాలపై మ్యాపింగ్ ప్రకారం పకడ్బందీగా చర్యలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. మ్యాపింగ్ తయారు తర్వాత మార్పులు కష్టతరమని, భవిష్యత్తులో వివాదాలు తలెత్తకుండా ప్రస్తుతం మోకాలో వినియోగిస్తున్న రోడ్డు (దారిని) సైతం మ్యాపింగ్ లో నమోదు చేయడం జరుగుతుందని తెలిపారు. సర్వేయర్లు, ప్రజల సహకారంతో సమస్యల పరిష్కారం వేగవంతం అవుతుందని తెలిపారు. మండలంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి అదనపు గదులు, భోజనశాల నిర్మాణ పనులను పరిశీలించి పనులు వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. వంటశాల, తరగతి గదులను పరిశీలించి విద్యార్థులకు మెనూ ప్రకారం సకాలంలో పోషక విలువలతో కూడిన ఆహారం అందించాలని, నాణ్యమైన విద్య అందించే దిశగా ఉపాధ్యాయులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. అనంతరం కోటపల్లి మండల కేంద్రంలో



కొనసాగుతున్న అమృత్ 2.0 పథకం పనులను మండల తహసిల్దార్ రాఘవేంద్ర, మండల పరిషత్ అభివృద్ధి అధికారి నాగేశ్వర్ రెడ్డి లతో కలిసి సందర్శించి పనులు త్వరగా పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో కొనసాగుతున్న అదనపు గదులు, భోజనశాల పనులను పరిశీలించి విద్యార్థులకు అందిస్తున్న మెనూ,విద్య బోధన తీరును పరిశీలించారు. మండల కేంద్రంలోని తహసిల్దార్ కార్యాలయాన్ని సందర్శించి భూభారతి రెవెన్యూ సదస్సులను అందిన దరఖాస్తుల ప్రక్రియను పరిశీలించి ప్రభుత్వ నిబంధనల ప్రకారం క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి, రెవెన్యూ రికార్డులతో సరి చూసి దరఖాస్తులను త్వరగా పరిష్కరించే విధంగా కృషి చేయాలని అధికారులకు సూచించారు. వివిధ ధ్రువపత్రాల కొరకు కార్యాలయానికి వచ్చిన దరఖాస్తులను నిబంధనలకు లోబడి పరిశీలించి నిర్ణీత గడువులోగా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రాజు గోండుల కోటను దేశంలోనే ప్రముఖ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలి

**-జిల్లా కలెక్టర్ రాజర్షిషా**

హంసకలం వార్త

పర్యాటకులను ఆకర్షించేలా గోండు రాజుల కోట పునరుద్ధరణ పనులు చేపట్టాలని కలెక్టర్ రాజర్షిషా స్పష్టం చేశారు. శుక్రవారం ఉట్నూర్ మండల కేంద్రంలోని చారిత్రక రాజు గోండుల కోటను సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ ప్రాజెక్టు అధికారి మంద మకరందుతో కలిసి ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా అధికారులతో కలిసి కలెక్టర్, పిఓ కోట పరిసర ప్రాంతాలను క్షుణ్ణంగా పరిశీలించి, అక్కడ చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై అధికారులతో చర్చించారు. అనంతరం ఐటిడిఏ పిఓ కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, గోండు రాజుల చరిత్రకు, గిరిజన సంస్కృతికి ప్రతీకగా నిలిచిన రాజు గోండుల కోటను త్వరితగతిన పునర్నిర్మించాలని ఆదేశించారు. ఆధునిక సౌకర్యాలతో దేశవ్యాప్తంగా పర్యాటకులను ఆకర్షించేలా దీనిని ప్రముఖ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని సంబంధిత శాఖల అధికారులను కోరారు. కోట పునర్నిర్మాణ పనుల్లో ఎక్కడా చారిత్రకతకు భంగం కలగకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని స్పష్టం చేశారు. భావితరాలకు గిరిజనుల గొప్ప చరిత్రను తెలియజేసే విధంగా కోటలో ఒక అత్యాధునిక మ్యూజియాన్ని ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ మ్యూజియంలో గోండు రాజుల వంశ చరిత్ర, వారి పాలన, సంస్కృతి, సంప్రదాయాలు, వారసత్వ ఆనవాళ్లు, పురాతన వస్తువులు, చారిత్రక ఆధారాలను ప్రతిబింబించేలా ఏర్పాట్లు చేయాలన్నారు. అదేవిధంగా కోట ప్రాంగణంలో గిరిజన సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు ప్రత్యేక వేదిక, గిరిజన హస్తకళలు, సంప్రదాయ ఉత్పత్తుల విక్రయానికి మార్కెటింగ్ స్టాల్స్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. వీటితో పాటు చిన్నారుల కోసం ప్రత్యేక పార్కు, క్రీడా ప్రాంగణం, సందర్శకుల కోసం రూఫింగ్ షెడ్లు, విశ్రాంతి భవనాలు, తాగునీరు, పారిశుద్ధ్య సదుపాయాలు, ఆకర్షణీయమైన ఉద్యానవనాలు, విద్యుద్దీపాల అలంకరణ, పచ్చదనం పెంపు వంటి అన్ని మౌలిక సదుపాయాలను కల్పించాలని పేర్కొన్నారు. సందర్శకులు కోట చరిత్రను సులభంగా తెలుసుకునే విధంగా సమాచార ఫలకాలు, దిశానిర్దేశక బోర్డులు, డిజిటల్ సమాచార వ్యవస్థలను అందుబాటులోకి తీసుకురావాలన్నారు. కోట అభివృద్ధి ద్వారా స్థానిక గిరిజన యువతకు ఉపాధి అవకాశాలు



పెరగడంతో పాటు ఉట్నూర్ ప్రాంతం పర్యాటక రంగంలో ప్రత్యేక గుర్తింపు పొందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఐటిడిఏ పిఓ మాట్లాడుతూ.. .రాజు గోండుల కోటను సుంద రీకరించి దేశవ్యాప్తంగా గుర్తింపు పొందే పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి త్వరితగతిన కార్యాచరణ చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్కియాలజీ డైరెక్టర్ అర్జున్ రావు, అదనపు డైరెక్టర్ నరసింహులు, డిడి సాగర్,ఓఎస్డి రాజు, పర్యాటక శాఖ అధికారి రవికుమార్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీరింగ్ తానాజీ, ఏపీఓ పిబిటిజి ఆత్రం భాస్కర్,డిప్యూటీ డిఇఓ చందన్, ప్రజాప్రతినిధులు, అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# బేతుపల్లి రీ సర్వే ప్రక్రియను నిబంధనల ప్రకారం పారదర్శకంగా నిర్వహించాలి..

**-జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్**

**-ప్రతి రైతుకు పూర్తి అవగాహన కల్పించి రీ సర్వే చేయాలి..**

**-ప్రభుత్వ భూములు, రహదారులు, ప్రజా స్థలాల వివరాలు కోఆర్డినేట్లతో నమోదు చేయాలి..**

**-రోజుకు ప్రతి బృందం 50 నుండి 60 ఎకరాల వరకు రీ సర్వే పూర్తి చేయాలి..**

**-సర్వే వివరాల డేటా ఎంట్రీ, మ్యాప్ తయారీ సమాంతరంగా కొనసాగాలి..**

**-సత్తుపల్లి మండలం బేతుపల్లి గ్రామంలో చేస్తున్న రీ సర్వే అధికారులకు దిశా నిర్దేశం చేసిన జిల్లా కలెక్టర్..**

హంసకలం వార్త

బేతుపల్లి రీ సర్వే ప్రక్రియను ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలు, మార్గదర్శకాల ప్రకారం పూర్తిస్థాయి పారదర్శకతతో నిర్వహించాలని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ అధికారులను ఆదేశించారు. భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపడంతో పాటు ఖచ్చితమైన భూ రికార్డుల తయారీ లక్ష్యంగా బేతుపల్లి గ్రామంలో చేపట్టిన రీ సర్వే ప్రక్రియను శుక్రవారం జిల్లా కలెక్టర్, సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్‌తో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించి అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ, బేతుపల్లి గ్రామంలో భూ సమస్యల పరిష్కారమే ప్రధాన లక్ష్యంగా రీ సర్వే చేపడుతున్నామని తెలిపారు. ప్రతి రైతుకు రీ సర్వే ప్రక్రియపై పూర్తి అవగాహన కల్పించి, వారి సమక్షంలోనే పారదర్శకంగా సర్వే నిర్వహించాలని సూచించారు. రీ సర్వే ద్వారా భూముల విస్తీర్ణాలు, హద్దులు, యాజమాన్య వివరాలను శాస్త్రీయ పద్ధతిలో నమోదు చేసి భూ రికార్డులను ఆధునికీకరించనున్నట్లు తెలిపారు. రీ సర్వే నిర్వహణ కోసం గ్రామంలో పది ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. ప్రతి బృందంలో ఒక సర్వేయర్‌తో పాటు ఇద్దరు జీపీవోలు పనిచేస్తారని చెప్పారు. రైతు వేదికను కేంద్రంగా ఉపయోగించుకుని అక్కడే కంప్యూటర్ వ్యవస్థ ఏర్పాటు చేసి, క్షేత్రస్థాయిలో సేకరించిన వివరాలను వెంటనే డేటా ఎంట్రీ చేయాలని ఆదేశించారు.



ప్రభుత్వం జారీ చేసిన స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ (ఎస్ఓపీ) ప్రకారం ప్రతి దశను కచ్చితంగా అమలు చేయాలని, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా నిబంధనలను పాటించాలని అధికారులను ఆదేశించారు. గ్రామంలోని ప్రభుత్వ భూములు, రహదారులు, చెరువులు, కాలువలు, ప్రజా స్థలాలు, ప్రభుత్వ కార్యాలయాల స్థలాలను కోఆర్డినేట్లతో సహా స్పష్టంగా నమోదు చేయాలని సూచించారు. ప్రభుత్వ భూములకు సంబంధించి పంచనామాలు నిర్వహించి ఖచ్చితమైన రికార్డులు సిద్ధం చేయాలని తెలిపారు. ప్రతి బృందం రోజుకు 50 నుంచి 60 ఎకరాల వరకు రీ సర్వే పూర్తి చేయాలని, పది బృందాలు కలిసి రోజుకు సుమారు 500 నుంచి 600 ఎకరాల వరకు సర్వే నిర్వహించేలా కార్యాచరణ రూపొందించాలని కలెక్టర్ సూచించారు. ప్రతిరోజూ ఉదయం 7 గంటల నుంచే క్షేత్రస్థాయిలో పనులు ప్రారంభించి, రైతుల సమక్షంలో భూ వివరాలను నమోదు చేయాలని తెలిపారు. ప్రతి రైతు పేరు, భూ విస్తీర్ణం, సరిహద్దులు, ఇతర వివరాలను ఖచ్చితంగా నమోదు చేయడంతో పాటు ప్రతిరోజూ సర్వే పురోగతిపై నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. సర్వే పూర్తయ్యే వరకు డేటా ఎంట్రీ, డిజిటల్ మ్యాప్ తయారీ ప్రక్రియ కూడా సమాంతరంగా కొనసాగాలని స్పష్టం చేశారు. రీ సర్వే వల్ల ఏ రైతు తన భూమి విస్తీర్ణాన్ని కోల్పోయే పరిస్థితి ఉండదని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ ప్రక్రియ పూర్తిగా శాస్త్రీయ విధానంలో, పారదర్శకంగా జరుగుతుందని రైతులు అపోహలకు గురికావద్దని సూచించారు. గ్రామ సభలు నిర్వహించి ప్రజలకు పూర్తి అవగాహన కల్పించాలని, రెవెన్యూ గ్రామ పరిధిలోని ప్రతి రైతును గ్రామ సభలకు ఆహ్వానించి వారి అభిప్రాయాలు, సమస్యలను తెలుసుకోవాలని అధికారులకు సూచించారు. క్షేత్రస్థాయిలో అధికారులు సమన్వయంతో పనిచేసి ఎలాంటి వివాదాలకు తావులేకుండా రీ సర్వేను విజయవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ ఆదేశించారు. ఈ పరిశీలనలో సత్తుపల్లి తహసీల్దార్, తిరుమలాయపాలెం తహసీల్దార్ విల్సన్, సర్వేయర్లు, రెవెన్యూ అధికారులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# అర్హులందరికీ ప్రభుత్వ పథకాల ఫలాలు చేరాలి

**-ఎంపి గొడం నగేష్**






ధర్మఘంట జూలై 03 నిర్మల్ జిల్లా ప్రతినిధి :


జిల్లాలో కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ, అభివృద్ధి పథకాల అమలును మరింత సమర్థవంతంగా చేపట్టి, అర్హులైన ప్రతి లబ్ధిదారునికి ప్రభుత్వ పథకాల ఫలాలు చేరేలా అధికారం నగేశ్ అధ్యక్షతన నిర్వహించగా,జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా, నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్, మున్సిపల్ చైర్‌పర్సన్, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. సమావేశంలో గత ఏడాది కాలంగా వివిధ శాఖల ద్వారా చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల అమలు, పెండింగ్ పనులు, భౌతిక, ఆర్థిక పురోగతిపై శాఖల వారీగా సమగ్ర సమీక్ష నిర్వహించారు. గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఉపాధి హామీ పనులు, ఈజీఎస్, మెటీరియల్ వర్క్స్, 'ఏరువాక-మన ఊరు మన చేను' కార్యక్రమం, బ్యాంకు లింకేజీ, పంచాయతీరాజ్ శాఖ ద్వారా ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజన, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు,వ్యవసాయ శాఖ ద్వారా పీఎంకేఎస్‌వై అమలు,యూరియా నిల్వలు,విద్యుత్ శాఖ మౌలిక సదుపాయాలు, వైద్య ఆరోగ్య శాఖ నేషనల్ హెల్త్ మిషన్, విద్యాశాఖ సర్వ శిక్ష అభియాన్, పీఎం శ్రీ, మధ్యాహ్న భోజన పథకం,మహిళా శిశు సంక్షేమ శాఖ ఐసీడీఎస్, ఉద్యానవన, అటవీ, గిరిజన సంక్షేమ, క్రీడలు, పౌర సరఫరాలు, బీఎస్ఎన్ఎల్, నేషనల్ హైవే, లీడ్ బ్యాంక్ తదితర శాఖల పనితీరును సమీక్షించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ...కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాల అమలుపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ప్రతి శాఖ పనితీరును విడివిడిగా సమీక్షించి సమస్యలకు తక్షణ పరిష్కారాలు చూపాలని, అభివృద్ధి పనులు జాప్యం లేకుండా పూర్తి చేయాలని ఆదేశించారు. ఉపాధి హామీ కింద అర్హులైన ప్రతి జాబ్‌కార్డు దారుకు ఉపాధి కల్పించాలని, ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందేలా చర్యలు తీసుకోవాలని, అంగన్‌వాడీ భవనాల నిర్మాణాలు వేగవంతం చేయాలని సూచించారు. అవసరమైన ప్రాంతాల్లో బీఎస్ఎన్ఎల్ సెల్ టవర్లు,అటవీ ప్రాంతాల్లో సోలార్ విద్యుత్ సౌకర్యాలు కల్పించాలని, రేషన్ బియ్యం పారదర్శకంగా పంపిణీ చేయాలని తెలిపారు. నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ, ఉపాధి హామీ పనుల్లో సమాన పనిదినాలు, సమాన వేతనం అమలు చేయాలని, అనుమతులు లభించిన అభివృద్ధి పనులను వెంటనే పూర్తి చేయాలని సూచించారు. యూరియా సరఫరాలో ఇబ్బందులు లేకుండా చూడాలని,రైతులకు యూరియా యాప్ వినియోగంపై క్షేత్రస్థాయిలో సహాయం అందించాలని పేర్కొన్నారు. ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ మాట్లాడుతూ, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలకు అటవీ అనుమతుల సమస్యలు ఉన్నచోట పరిష్కారం చూపాలని,నిర్మాణాల్లో నాణ్యతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ మాట్లాడుతూ...భైంసా సమీప జాతీయ రహదారిపై ప్రమాదకర బ్లాక్‌స్పాట్లను గుర్తించి ప్రమాదాల నివారణ చర్యలు చేపట్టాలని, బాసర వంతెనను ప్రమాదరహితంగా తీర్చిదిద్దాలని కోరారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రతి లబ్ధిదారునికి పారదర్శకంగా అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అభివృద్ధి పనులను నిర్ణీత గడువులో పూర్తి చేయాలని, ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై వెంటనే స్పందించి పరిష్కారం చూపాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో రెవెన్యూ మ్యాప్‌లు లేని 14 గ్రామాల్లో సర్వేలు, 70 గ్రామాల్లో రీ-సర్వే చేపడుతున్నట్లు వెల్లడించారు. శాఖల వారీగా అధికారులు తమ పురోగతిని వివరించారు. జిల్లాలో 1.74 లక్షల జాబ్‌కార్డుదారులకు ఉపాధి కల్పిస్తున్నట్లు, ఇందిరమ్మ ఇండ్ల కింద 2,136 గృహాలు పూర్తిచేసి రూ. 146 కోట్లు లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేసినట్లు తెలిపారు. విద్యాశాఖ ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజన పథకానికి రూ. 17.74 కోట్లు వ్యయం చేసినట్లు, 20 పీఎం శ్రీ పాఠశాలలకు రూ. 1.34 కోట్లు కేటాయించినట్లు వెల్లడించారు. జిల్లాలో 2.49 లక్షల రేషన్ కార్డుల ద్వారా ప్రతి నెల ఉచిత సన్నబియ్యం పంపిణీ చేస్తున్నట్లు, 41,950 కొత్త రేషన్ కార్డులు జారీ చేసినట్లు వివరించారు. పీఎం కిసాన్ పథకం కింద 53 వేల మంది రైతులకు రూ. 32 కోట్ల ఆర్థిక సహాయం అందించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఖానాపూర్ మున్సిపల్ చైర్ పర్సన్ అంకం మౌనిక, భైంసా మున్సిపల్ చైర్మన్ దత్తాద్రి,అదనపు కలెక్టర్లు బి.వెంకటేశ్వర్లు,కిషోర్ కుమార్,డీఎఫ్‌వో సుశాంత్ సుఖదేవ్ బోబడే,డీఆర్‌వో రాథోడ్ రమేష్,డీఆర్‌డీవో విజయలక్ష్మి, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# బిజినెస్

## పీఎఫ్ ఖాతాల్లో రూ.9,330 కోట్లు ఆ డబ్బు మాది అని అడిగేవారే లేరు!

కేంద్ర ప్రభుత్వం ఉద్యోగుల భవిష్య నిధి (ఈపీఎఫ్) చందాదారుల కోసం సరికొత్త 'ఈపీఎఫ్ స్కీమ్-2026'ను నోటిఫై చేసి డిజిటల్ యుగానికి శ్రీకారం చుట్టింది. అయితే, మరోవైపు దేశవ్యాప్తంగా సుమారు 31 లక్షల నిరుపయోగ ఈపీఎఫ్ ఖాతాల్లో దాదాపు రూ.9,330 కోట్లకు పైగా కార్మికుల సొమ్ము క్లెయిమ్ చేయకుండా మూలుగుతోందన్న సంచలన విషయం వెలుగులోకి వచ్చింది. 'ఇండియా టుడే' ప్రత్యేకంగా సమాచార హక్కు (ఆర్టీఐ) చట్టం ద్వారా పొందిన ఈ వివరాలు బయటకు వచ్చాయి. 1952 నాటి పాత పథకం స్థానంలో జూన్ 29 నుంచి అమల్లోకి వచ్చిన కొత్త ఈపీఎఫ్ స్కీమ్-2026, నిబంధనలను సరళతరం చేయడం, వ్యవస్థను డిజిటలైజ్ చేయడం లక్ష్యంగా పెట్టుకుంది. దీనివల్ల దేశవ్యాప్తంగా సుమారు 8 కోట్ల మంది యాక్టివ్ చందాదారులకు ప్రయోజనం చేకూరనుంది. ఈ సంస్కరణల నేపథ్యంలో కార్మికుల పదవీ విరమణ పొదుపు ఎంత పెద్ద మొత్తంలో వారికి చేరకుండా నిలిచిపోయిందో ఆర్టీఐ గణాంకాలు కళ్లకు కడుతున్నాయి. ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ (ఈపీఎఫ్ఓ) అందించిన సమాచారం ప్రకారం.. 2026 మార్చి 31 నాటికి దేశవ్యాప్తంగా 30,91,862 నిరుపయోగ ఖాతాలు ఉన్నాయి. వీటిలో సుమారు రూ.9,330 కోట్లు క్లెయిమ్ చేయని నిల్వలు ఉన్నాయి. గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే పరిస్థితి స్వల్పంగా మెరుగుపడినప్పటికీ, సమస్య తీవ్రత మాత్రం తగ్గలేదు. 2025 మార్చి 31 నాటికి 31.83 లక్షల ఖాతాల్లో రూ.10,181 కోట్లు ఉండగా, ఏడాది వ్యవధిలో నిరుపయోగ ఖాతాల సంఖ్య 92,000, క్లెయిమ్ చేయని మొత్తం రూ.851 కోట్లు తగ్గింది. అయితే, ఇప్పటికీ దాదాపు 31 లక్షల ఖాతాలు నిద్రాణంగా ఉండటం ఆందోళన కలిగించే అంశం.

## ఆ చైనా యాప్‌లను తొలగించండి.. ఈ-రిక్షాల నిలిపివేతపై కేంద్రం సీరియస్!




ఈ-రిక్షాలను దూరం నుంచే నిలిపివేయడానికి ఉపయోగిస్తున్న 'BAT BMS', 'Epoch Li-ion' యాప్‌లను గూగుల్ ప్లే స్టోర్, యాపిల్ యాప్ స్టోర్ నుంచి తొలగించాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశించింది. ఈ యాప్‌ల దుర్వినియోగంపై వచ్చిన నివేదికల తర్వాత ఎలక్ట్రానిక్స్, ఐటీ మంత్రిత్వ శాఖ ఈ నిర్ణయం తీసుకుంది. ఈ రెండు యాప్‌లు బ్లూటూత్ ద్వారా లిథియం-అయాన్ బ్యాటరీ మేనేజ్‌మెంట్ సిస్టమ్‌కు కనెక్ట్ అవుతాయి. బ్యాటరీ పనితీరును పర్యవేక్షించేందుకు రూపొందించినప్పటికీ కొందరు వీటిని ఈ-రిక్షాల పవర్‌ను దూరం నుంచే నిలిపివేయడానికి ఉపయోగిస్తున్నారు. యాప్‌లోని డిశ్చార్జ్ స్విచ్ నొక్కగానే వాహనం ఒక్కసారిగా ఆగిపోతోంది. చాలా ఈ-రిక్షాల్లో ఉపయోగించే బ్యాటరీ మేనేజ్‌మెంట్ సిస్టమ్‌లలో పాస్‌వర్డ్, ఇతర భద్రతా ధ్రువీకరణ లేకపోవడమే ఈ సమస్యకు కారణమని అధికారులు తెలిపారు. దీంతో సమీపంలో ఉన్న ఎవరైనా బ్లూటూత్ ద్వారా కనెక్ట్ అయి వాహనాన్ని నిలిపివేయగలుగుతున్నారు. తిరిగి అదే యాప్ ద్వారా ఆన్ చేస్తేనే వాహనం మళ్లీ పనిచేస్తోంది. ఇలాంటి ప్రమాదకర యాప్‌లు ప్రజలకు అందుబాటులో ఉండకుండా చర్యలు తీసుకుంటామని కేంద్రం తెలిపింది. భవిష్యత్తులో కూడా ప్రజల భద్రతకు ముప్పుగా మారే యాప్‌లను గుర్తించి యాప్ స్టోర్ల నుంచి తొలగించే చర్యలు కొనసాగుతాయని స్పష్టం చేసింది.

## బెంగళూరు ఫ్యాన్స్‌కు పండగే: నథింగ్ నుంచి అదిరిపోయే 'నథింగ్ ఫోన్ (4ఎ) ఆర్సీబీ ఎడిషన్'.. సేల్ ఎప్పుడంటే..!



ప్రముఖ టెక్ బ్రాండ్ 'నథింగ్'.. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) ఫ్యాన్స్ కోసం ఒక అద్భుతమైన ఫోన్‌ను ప్రకటించింది. వరుసగా రెండుసార్లు ఛాంపియన్‌షిప్ విజయాలను అందుకున్న ఆర్సీబీ టీమ్ గౌరవార్థం, నథింగ్-ఆర్సీబీ భాగస్వామ్యానికి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా.. ప్రత్యేకమైన 'చీశ్ఫ్రఅస్త్రాష్ట్రశీఅవ (4b) RCB ఎడిషన్'ను విడుదల చేస్తున్నట్లు సంస్థ వెల్లడించింది. ఎడిషన్ స్పెషాలిటీ ఈ స్మార్ట్‌ఫోన్‌ను పూర్తిగా ఆర్సీబీ టీమ్ రంగులైన 'రెడ్' కలర్ థీమ్‌తో, మ్యాట్ ఫినిషింగ్‌తో ఆకర్షణీయంగా రూపొందించారు. ఫోన్ వెనుక భాగంలో ప్రత్యేకమైన ఆర్సీబీ బ్రాండింగ్ ఉంటుంది. ఇది కేవలం ఒక ఫోన్ మాత్రమే కాదు, ఫ్యాన్స్‌కు ఒక 'కలెక్టబుల్ ఐటమ్'గా నిలవనుంది. సేల్ వివరాలు ఈ ఫోన్ ఈ నెల 7న మాత్రమే బెంగళూరులోని అధికారిక 'నథింగ్ స్టోర్'లో అందుబాటులో ఉంటుంది. ఇది చాలా పరిమిత సంఖ్యలో వస్తున్నందున 'మొదట వచ్చిన వారికి మొదటి ప్రాధాన్యం' పద్ధతిలో విక్రయించనున్నారు. స్టాండర్డ్ 'నథింగ్ ఫోన్ (4b)' ఫీచర్లు ఆర్సీబీ ఎడిషన్‌తో పాటు, నథింగ్ సంస్థ తన స్టాండర్డ్ నథింగ్ ఫోన్(4బి)'ని జులై 7 మధ్యాహ్నం 3:30 గంటలకు భారత్‌లో అధికారికంగా విడుదల చేయనుంది. దీని ప్రధాన ఫీచర్లు ఇలా ఉండనున్నాయి:

ప్రాసెసర్: శక్తిమంతమైన స్నాప్‌డ్రాగన్ ప్రాసెసర్‌తో ఇది గత మోడళ్ల కంటే వేగవంతంగా పనిచేయనుంది.

డిస్‌ప్లే: 120Hz రిఫ్రెష్ రేట్‌తో 6.77 అంగుళాల అమోలెడ్ డిస్‌ప్లే

కెమెరా: 50MP మెయిన్ సెన్సార్‌తో కూడిన ట్రిపుల్ కెమెరా సెటప్ (పెరిస్కోప్ టెలిఫోటో లెన్స్‌తో)

బ్యాటరీ: 5,000mAh సామర్థ్యం గల బ్యాటరీ, వేగవంతమైన ఛార్జింగ్ సదుపాయం

డిజైన్: నథింగ్ బ్రాండ్ ప్రత్యేకత అయిన 'ట్రాన్స్‌పరెంట్ డిజైన్', గ్లైఫ్ ఇంటర్‌ఫేస్ దీనిలో కొనసాగనున్నాయి.

నథింగ్ ఫోన్ (4b) ఆర్సీబీ ఎడిషన్ ధరలు, ఇతర పూర్తి స్పెసిఫికేషన్లను జులై 7న జరిగే గ్రాండ్ లాంచ్ ఈవెంట్‌లో సంస్థ వెల్లడించనుంది.

## వైభవ్ సూర్యవంశీకి ఇంత హైప్ ఇవ్వకండి: కపిల్ దేవ్




ఇంటర్నెట్ డెస్క్:

భారత సిక్సర్ల పిడుగు వైభవ్ సూర్యవంశీపై రోజురోజుకూ అంచనాలు పెరుగుతున్నాయి. 15 ఏళ్లకే సీనియర్ జట్టులో అవకాశం దక్కించుకుని చరిత్ర సృష్టించిన వైభవ్‌కు.. ఇంకా అంతర్జాతీయ క్రికెట్ అరంగేట్రం చేసే అవకాశం రాలేదు. ఐర్లాండ్ చేతిలో 2-0 తేడాతో సిరీస్ క్లీన్ స్వీప్.. సీనియర్ ప్లేయర్ల పేలవ ప్రదర్శన నేపథ్యంలో అతడికి ఛాన్స్ ఇచ్చి ఉండాల్సిందనే డిమాండ్లు వినిపిస్తున్నాయి. దీంతో ప్రస్తుతం చర్చంతా వైభవ్ అరంగేట్రం గురించే! ఈ క్రమంలో క్రికెట్ దిగ్గజం కపిల్ దేవ్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. వైభవ్ అసాధారణ ప్రతిభ కలిగిన ప్లేయర్ అయినప్పటికీ.. అతడికి ఇంత హైప్ ఇవ్వొద్దని సూచించాడు.వైభవ్ సూర్యవంశీ అద్భుతమైన ప్రతిభ కలిగిన ఆటగాడు అనడంలో ఎలాంటి సందేహం లేదు. అయితే ప్రస్తుతం అతడి గురించి చాలా ఎక్కువగా చర్చలు నడుస్తున్నాయి. వైభవ్‌కు ఇంకాస్త సమయం అవసరం. ఇంత చిన్న వయసులోనే అతడిపై అనవసర ఒత్తిడి తీసుకురావొద్దు. ఈ వయసులో అన్నింటినీ అర్థం చేసుకునే అనుభవం ఉండదు. టాలెంట్ విషయానికొస్తే సచిన్ టెండూల్కర్, విరాట్ కోహ్లీ స్థాయిలోనే వైభవ్ కూడా రాణిస్తాడని అనిపిస్తోంది. అయితే అది టీ20 క్రికెట్‌లో మాత్రమే. వన్డేలు, టెస్టుల్లో కూడా తన సామర్థ్యాన్ని నిరూపించుకోవాల్సి ఉంటుంది. టీ20ల్లో అతడు అసాధారణ ఆటగాడు. ఇంత చిన్న వయసులో ఇలాంటి ప్రభావం చూపే ఆటగాళ్లు చాలా అరుదు. సచిన్ టెండూల్కర్ కూడా చిన్న వయసులోనే భారత జట్టులోకి వచ్చాడు. అప్పుడు కూడా తొందర పడ్డామేమో అనుకున్నాం. కానీ చరిత్రను చూస్తే ఆలస్యం చేస్తే తప్పు అయ్యేదని తెలుస్తుంది. వైభవ్ సిద్ధంగా ఉంటే అతని వయసు కాదు.. సామర్థ్యాన్ని పరిగణనలోకి తీసుకోవాలి' అని కపిల్ దేవ్ స్పష్టం చేశాడు. కాగా, భారత్-ఇంగ్లండ్ తొలి టీ20 వర్షం కారణంగా రద్దు కాగా, రెండో మ్యాచ్ శనివారం జరగనుంది. ఈ మ్యాచ్‌లో వైభవ్ సూర్యవంశీకి అవకాశం దక్కుతుందా? లేదా? అన్నది ఆసక్తికరంగా మారింది.

## ధోని, జకోవిచ్‌లో ఓ అరుదైన గుణం ఉంది: దీప్తి శర్మ




ఇంటర్నెట్ డెస్క్:

భారత క్రికెట్ దిగ్గజం ఎంఎస్ ధోని, టెన్నిస్ స్టార్ ప్లేయర్ జకోవిచ్‌ల గురించి టీమిండియా మహిళా పేసర్ దీప్తి శర్మ ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. వీరిద్దరిలో ఓ అరుదైన గుణం ఉందని తెలిపింది. ఎంతటి ఒత్తిడి పరిస్థితుల్లోనైనా ప్రశాంతంగా ఉండి మ్యాచ్‌ను తమవైపు తిప్పుకునే అరుదైన లక్షణం వీరిద్దరిలో ఉందని దీప్తి శర్మ వెల్లడించింది. వింబుల్డన్ టోర్నీకి వెళ్లిన దీప్తి.. ఓ ఇంటర్వ్యూలో ఈ విషయాలపై మాట్లాడింది.జకోవిచ్ ప్రస్తావన వస్తే అందరూ ముందుగా అతడి మానసిక దృఢత్వం గురించే చెబుతుంటారు. ఎంతటి క్లిష్ట పరిస్థితుల్లో అయినా అతడు పోరాటం మాత్రం ఆపడు. క్రికెట్‌లో ఇలాంటి లక్షణాలు ఎంఎస్ ధోని సర్‌లో కనిపిస్తాయి. ఆయన కూడా ఎప్పుడూ ప్రశాంతంగా ఉంటారు. ఒత్తిడి ఉన్నప్పటికీ ఎలాంటి ఆందోళన పడకుండా మ్యాచ్‌ను అద్భుతంగా ముగిస్తారు. ధోని సర్, జకోవిచ్ ఇద్దరిలోనూ ఓ అరుదైన గుణం ఉంది. అత్యంత కీలక సమయంలో ఒత్తిడిని అధిగమించి ప్రశాంతంగా ఉంటారు. వారిని చూసి చాలా విషయాలు నేర్చుకోవచ్చు' అని దీప్తి శర్మ తెలిపింది.

**-ఇది నా చిరకాల కోరిక.**

'వింబుల్డన్‌కు వచ్చి ప్రత్యక్షంగా మ్యాచ్‌లు చూడటం నా చిరకాల కోరిక. టీవీలో మాత్రమే ఈ మ్యాచ్‌లు చూసేదాన్ని. ఇప్పుడు ఇక్కడికి వచ్చి లైవ్ మ్యాచ్‌లు చూడటం అద్భుత అనుభూతిని కలిగిస్తోంది. నాకు జకోవిచ్ అత్యంత ఇష్టమైన టెన్నిస్ ప్లేయర్. కోర్టులో అతడు పోరాడే తీరు నన్నెంతో ఆకట్టుకుంటుంది. అతడి ఆట ఎప్పుడూ స్ఫూర్తినిస్తుంది. నా చిన్నప్పుడు రోజర్ ఫెదరర్, రాఫెల్ నాదల్ మ్యాచ్‌లు ఎక్కువగా చూసేదాన్ని. కానీ కొంతకాలంగా జకోవిచ్ ఆటనే ఎక్కువగా ఫాలో అవుతున్నా' అని దీప్తి తెలిపింది. వింబుల్డన్‌కు తనతో పాటు ఎవరిని తీసుకెళ్లాలని అనుకుంటారనే ప్రశ్న ఎదురవ్వగా.. 'సచిన్ సర్, రవిశాస్త్రి సర్, సునీల్ గావస్కర్ సర్‌లను నాతో తీసుకెళ్లాలనుకుంటా. వారి క్రీడా ప్రపంచంలో దిగ్గజాలు. వారితో కలిసి టెన్నిస్ మ్యాచ్ చూస్తూ వారి విశ్లేషణ వినడం గొప్ప అనుభవంగా ఉంటుంది' అని దీప్తి శర్మ వెల్లడించింది.

# స్పోర్ట్స్

## తొందరపాటు నిర్ణయాలు తీసుకోను రిటైర్‌మెంట్‌పై రొనాల్డో క్లారిటీ

ఇంటర్నెట్ డెస్క్:



పోర్చుగల్ ఫుట్‌బాల్ దిగ్గజం క్రిస్టియానో రొనాల్డో రిటైర్‌మెంట్‌పై కొంతకాలంగా ఊహాగానాలు వస్తోన్న సంగతి తెలిసిందే. క్రొయేషియాతో మ్యాచ్ అనంతరం.. రొనాల్డో సోదరి కాటియా చేసిన వ్యాఖ్యలు సంచలనం సృష్టించాయి. ఈ ప్రపంచ కప్ టోర్నీనే అతడికి చివరిదంటూ ఆమె పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో తన రిటైర్‌మెంట్‌పై వస్తోన్న వార్తలపై రొనాల్డో స్పందించాడు. ప్రపంచ కప్ ముగిసిన తర్వాతే తన భవిష్యత్తుపై నిర్ణయం తీసుకుంటానని స్పష్టం చేశాడు. దీంతో రిటైర్‌మెంట్ వార్తలకు చెక్ పడినట్లు అయింది.రౌండ్ ఆఫ్ 32లో క్రొయేషియాపై పోర్చుగల్ 2-1 తేడాతో విజయం సాధించి.. ప్రీక్వార్టర్‌కు అర్హత సాధించింది. ఈ మ్యాచ్ అనంతరం రొనాల్డో మాట్లాడాడు. 'నేను ఎప్పుడూ తొందరపాటు నిర్ణయాలు తీసుకోను. ప్రస్తుతం నా దృష్టి ప్రపంచ కప్ గెలవడంపైనే ఉంది. నా భవిష్యత్తు గురించి టోర్నీ ముగిసిన తర్వాతే నిర్ణయం తీసుకుంటా' అని స్పష్టం చేశాడు. ఇదే మ్యాచ్‌లో రొనాల్డో మరో అరుదైన రికార్డును తన ఖాతాలో వేసుకున్నాడు. ప్రపంచకప్ నాకౌట్ మ్యాచ్‌లో గోల్ చేసిన అత్యంత వయసున్న ఆటగాడిగా చరిత్ర సృష్టించాడు. 41 సంవత్సరాల 147 రోజుల వయసులో ఈ ఘనత సాధించి గత రికార్డును అధిగమించాడు. అంతేకాదు, తన కెరీర్‌లో ప్రపంచకప్ నాకౌట్ దశలో నమోదు చేసిన తొలి గోల్ కూడా ఇదే కావడం విశేషం. క్రొయేషియాపై అద్భుత ఆటతీరుకు రొనాల్డోకు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు లభించింది. మరోవైపు, క్రొయేషియా చేసిన రెండు గోల్స్ ఆఫ్‌సైడ్ కారణంగా రద్దు కావడం మ్యాచ్ ఫలితాన్ని ప్రభావితం చేసింది. ఈ విజయంతో పోర్చుగల్ ప్రీక్వార్టర్‌లో స్పెయిన్‌తో ఆసక్తికర సమరానికి సిద్ధమవుతోంది.

# జయకృష్ణ ఘట్టమనేని 'శ్రీనివాస మంగాపురం' వచ్చేస్తోంది.. రిలీజ్ డేట్ ఫిక్స్

సూపర్ స్టార్ మహేశ్ బాబు సోదరుడి కుమారుడు జయకృష్ణ ఘట్టమనేని హీరోగా పరిచయమవుతున్న చిత్రం 'శ్రీనివాస మంగాపురం'. ఈ సినిమా విడుదల తేదీని చిత్రబృందం అధికారికంగా ప్రకటించింది. ఈ జూలై 30న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి రానున్నట్లు శుక్రవారం వెల్లడించింది. ఈ చిత్రంలో బాలీవుడ్ నటి రవీనా టాండన్ కుమార్తె రాషా తడానీ హీరోయిన్‌గా నటిస్తూ టాలీవుడ్‌కు పరిచయమవుతోంది. 'RX 100', 'మంగళవారం' వంటి విజయవంతమైన చిత్రాల దర్శకుడు అజయ్ భూపతి ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. తిరుపతి నేపథ్యంలో సాగే ఓ ఇంటెన్స్ లవ్‌స్టోరీగా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. స్నేహితులుగా ఉండి ప్రేమికులుగా మారిన వాసుబాబు, మంగల కథ ఇది. వారి ఆనందమయ జీవితంలోకి ఓ ఊహించని సంఘర్షణ ఎదురైనప్పుడు ఏం జరిగిందనేదే కథాంశం. తనదైన శైలిలో యాక్షన్, డ్రామా జోడించి అజయ్ భూపతి ఈ ప్రేమకథను తీర్చిదిద్దినట్లు తెలుస్తోంది. ఈ సినిమాలో సీనియర్ నటుడు మోహన్ బాబు 'వెంకటప్పయ్య నాయుడు' అనే కీలకమైన ప్రతినాయకుడి పాత్రలో కనిపించనుండటం విశేషం. ప్రముఖ నిర్మాత అశ్విని దత్ సమర్పణలో, చందమామ కథలు పిక్చర్స్ బ్యానర్‌పై పి. కిరణ్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన మూడు పాటలు, టీజర్లు సినిమాపై అంచనాలను పెంచాయి. ఈ చిత్రానికి రెండుసార్లు జాతీయ అవార్డు గ్రహీత జీవీ ప్రకాశ్ కుమార్ సంగీతం అందిస్తుండగా, జయకృష్ణ గుమ్మడి సినిమాటోగ్రఫీ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.



ఈ ఏడాది మార్చి నాటికే దాదాపు 60 శాతం చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ సినిమా, ప్రస్తుతం శరవేగంగా పనులు జరుపుకుంటోంది.

## రెండు సర్జరీలు చేశారు.. కోలుకోవడానికి 16 నెలలు పట్టింది: అఖిల్



తన కెరీర్‌లో మూడేళ్ల గ్యాప్ రావడంపై హీరో అక్కినేని అఖిల్ స్పందించాడు. "'ఏజెంట్' సినిమా విడుదలైన మూడు నెలలకు బాత్రూమ్‌లో ప్రమాదవశాత్తూ జారి పడ్డాను. గాజు ముక్కలు గుచ్చుకుని నా ఎడమ చేయి తీవ్రంగా గాయపడింది. ఆ ఘోర ప్రమాదం వల్ల ఎడమ చేతి వేళ్లకు రెండు మేజర్ మైక్రో సర్జరీలు చేయాల్సి వచ్చింది. ఏకంగా 48 కుట్లు పడ్డాయి. గాయం తీవ్రత కారణంగా కనీసం ఎనిమిది నెలల పాటు బరువులు కూడా ఎత్తలేకపోయాను. శారీరకంగానే కాకుండా మానసికంగా కూడా పూర్తిగా కోలుకోవడానికి దాదాపు 16 నెలల సమయం పట్టింది. అందుకే మూడేళ్ల పాటు కొత్త సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాలేకపోయాను" అని తెలిపాడు. ఈ గ్యాప్ వల్ల అభిమానులు అసంతృప్తిగా ఉన్నారనే విషయం తనకు తెలుసని అఖిల్ చెప్పాడు. అయితే, ఇకపై కెరీర్‌లో ఇలాంటి విరామాలు రాకుండా చూసుకుంటానని తెలిపాడు. అఖిల్ తాజా చిత్రం 'లెనిన్' ఈనె 10న విడుదల కాబోతోంది. ఈ నేపథ్యంలో చిత్ర ప్రమోషన్లలో భాగంగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ... తన వ్యక్తిగత జీవితంలో ఎదుర్కొన్న చీకటి రోజులను గుర్తుచేసుకున్నారు. మరోవైపు, మురళీ కిశోర్ అబ్బూరు దర్శకత్వంలో, సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ నిర్మిస్తున్న 'లెనిన్' చిత్రంలో అఖిల్ సరసన భాగ్యశ్రీ బోర్సే హీరోయిన్‌గా నటిస్తోంది. ఈ చిత్రం ప్రేక్షకులను మెప్పిస్తుందని, ఘన విజయం సాధిస్తుందని అఖిల్ ధీమా వ్యక్తం చేశాడు.

## 'గుర్తుకొస్తున్నాయి' సిరీస్‌కు ఐకాన్ స్టార్ అండ.. నిర్మాతగా మారిన మిత్రుడికి బన్నీ ఎమోషనల్ విషెస్




బేబీ' చిత్రంతో యువతలో మంచి క్రేజ్ సంపాదించుకున్న విరాజ్ అశ్విన్, యశశ్రీ రావు జంటగా నటించిన వెబ్ సిరీస్ 'గుర్తుకొస్తున్నాయి'. ఫీల్ గుడ్ స్కూల్ డేస్ జ్ఞాపకాల నేపథ్యంలో తెరకెక్కిన ఈ సిరీస్, జులై 3 నుంచి 'ఈటీవీ విన్' ఓటీటీలో స్ట్రీమింగ్ అవుతూ ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. ఈ సిరీస్‌కు సానుకూల స్పందన వస్తున్న తరుణంలో, ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ చిత్ర బృందానికి తన మద్దతు తెలుపుతూ సోషల్ మీడియాలో ఒక ప్రత్యేక పోస్ట్ పెట్టారు. ఇది ఇప్పుడు ఇండస్ట్రీ వర్గాల్లో ఆసక్తిని రేపుతోంది. ఈ సిరీస్ ద్వారా ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ శరత్ చంద్ర నాయుడు పూర్తిస్థాయి నిర్మాతగా పరిచయమయ్యారు. గతంలో 'చావు కబురు చల్లగా', 'వినరో భాగ్యము విష్ణు కథ' వంటి చిత్రాలకు పనిచేసిన శరత్‌తో ఉన్న అనుబంధం దృష్ట్యా అల్లు అర్జున్ ఆయన్ను ప్రత్యేకంగా అభినందించారు. ఈ మేరకు 'ఎక్స్' వేదికగా బన్నీ ఒక ఎమోషనల్ పోస్ట్ చేశారు. "'గుర్తుకొస్తున్నాయి' సిరీస్ గురించి చాలా అద్భుతమైన విషయాలు వింటున్నాను. నా ప్రియమైన శరత్ చంద్రకు, చిత్ర యూనిట్ మొత్తానికి నా హృదయపూర్వక అభినందనలు. నువ్వు ఒక నిర్మాతగా నీ మొదటి అడుగు వేయడం చూడటం నాకు ప్రత్యేకంగా చాలా సంతోషాన్ని ఇస్తోంది. ఈ అందమైన సిరీస్ ప్రేక్షకుల ప్రేమాభిమానాలు, ప్రశంసలతో పాటు గొప్ప విజయాన్ని అందుకోవాలని ఆకాంక్షిస్తున్నాను. చిత్ర తారాగణానికి, సాంకేతిక నిపుణులందరికీ నా శుభాకాంక్షలు. ఈ సిరీస్‌ను ఈటీవీ విన్‌లో చూడటానికి ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను" అని బన్నీ తన పోస్ట్‌లో పేర్కొన్నారు. వినోద్ గాలి దర్శకత్వం వహించిన ఈ సిరీస్, స్కూల్ రోజుల నాటి మధుర జ్ఞాపకాలను గుర్తుచేస్తూ యువతను, కుటుంబ ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది.

# అభ్యంతరకర కంటెంట్‌కు వ్యతిరేకంగా కోర్టును ఆశ్రయించిన ప్రీతి జింతా

**-ఇంటర్నెట్‌లో సర్క్యులేట్ అవుతున్న ప్రీతి జింతా మార్ఫింగ్ కంటెంట్**

**-అభ్యంతరకర కంటెంట్‌ను తొలగించాలంటూ బాంబే హైకోర్టులో ప్రీతి పిటిషన్**

**-ప్రతివాదులుగా గూగుల్, మెటా వంటి దిగ్గజాలు**

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాంకేతికతతో సృష్టించిన డీప్‌ఫేక్ చిత్రాలు, మార్ఫింగ్ చేసిన అసభ్యకర కంటెంట్‌కు వ్యతిరేకంగా బాలీవుడ్ నటి ప్రీతి జింతా బాంబే హైకోర్టును ఆశ్రయించింది. ఇంటర్నెట్‌లో సర్క్యులేట్ అవుతున్న ఈ అభ్యంతరకర కంటెంట్‌ను తక్షణమే తొలగించేలా అత్యవసర ఆదేశాలు ఇవ్వాలని ఆమె న్యాయస్థానాన్ని కోరింది. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన కోర్టు.. వెబ్‌సైట్ల నుంచి ఇలాంటి తప్పుడు కంటెంట్‌ను తొలగించడానికి ఒక ఆచరణాత్మక విధానాన్ని (ప్రాక్టికల్ ప్రోటోకాల్) రూపొందించాలని ఆదేశించింది. ప్రీతి జింతా దాఖలు చేసిన ఈ వ్యాజ్యంలో గూగుల్, మెటా వంటి దిగ్గజాలతో పాటు డొమైన్ నేమ్ రిజిస్ట్రార్లను ప్రతివాదులుగా చేర్చారు. నటి తరఫు సీనియర్ న్యాయవాది వెంకటేశ్ ధోండ్ వాదనలు వినిపిస్తూ.. రోజురోజుకూ ఈ ఏఐ డీప్‌ఫేక్ చిత్రాల నాణ్యత పెరుగుతోందని, కొన్ని చిత్రాలు నిజమే అనిపించేలా ఉంటున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. బాధితురాలి గౌరవానికి భంగం కలగకుండా ఆ లింకులను వెంటనే తొలగించాలని కోరారు. గూగుల్, మెటా సంస్థల న్యాయవాదులు స్పందిస్తూ.. వివాదాస్పద లింకులను తొలగించడానికి తమకు ఎలాంటి అభ్యంతరం లేదని, అయితే సాధారణ చట్టబద్ధమైన కంటెంట్‌ను ముందస్తుగా అడ్డుకోవాలనే కఠిన నిబంధనలను విధించవద్దని అభ్యర్థించారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి.. సాధారణ వినియోగదారుల కంటెంట్‌కు ఇబ్బంది లేకుండా, కేవలం అభ్యంతరకర లింకులను మాత్రమే వేగంగా తొలగించేలా ప్రోటోకాల్ సిద్ధం చేయాలని ఆదేశించారు. ఈ కేసు



తదుపరి విచారణను కోర్ట ఈ నెల 6కు వాయిదా వేసింది.

# 'నాగబంధం'- మూవీ రివ్యూ!

ఒకే ఒక సినిమా అనుభవం ఉన్న హీరోతో 100 కోట్ల బడ్జెట్ తో ఒక సినిమా తీయాలనుకోవడం అంత ఆషామాషీ విషయమేం కాదు. కానీ 'నాగబంధం' సినిమా విషయంలో ఇలాంటి ఒక అద్భుతం జరిగింది. 'పెదకాపు' అనే ఒకే ఒక సినిమా చేసిన 'విరాట్ కర్ణ'తో 'నాగబంధం' సినిమా తెరకెక్కింది. భారీ బడ్జెట్ తో నిర్మితమైన ఈ సినిమాకి అభిషేక్ నామా దర్శకత్వం వహించాడు. నభా నటేశ్ .. జగపతిబాబు కీలకమైన పాత్రలను పోషించిన ఈ సినిమా, ఈ రోజునే థియేటర్లకు వచ్చింది. ఆర్కియాలజీ డిపార్టు మెంట్ లో ప్రభాకర్ (జగపతిబాబు) చీఫ్ గా పనిచేస్తుంటాడు. ఆధ్యాత్మిక పరమైన అంశాలపై అపారమైన ఆసక్తి ఉన్న కారణంగా ఆయన ఎక్కువగా ఆ విషయాలపై ఫోకస్ చేస్తుంటాడు. పురాణాలలో పేర్కొనబడిన విరాటమూర్తి ఆలయం ఎక్కడ ఉందనేది తెలుసుకోవడం కోసం ఆయన తన అన్వేషణ కొనసాగిస్తూ ఉంటాడు. ఈ విషయంపై ఆయన సహచరులైన టెస్లా .. అలీ (రిషబ్ సాహ్నీ) హిమాలయాలలో అన్వేషించడం మొదలుపెడతారు. అక్కడి గుహలో కాలవృక్షం చేత బంధించబడిన బైరాగి (గరుడ రామ్)ను చూస్తారు. బైరాగి తన మాటల చేత అలీని తన వైపుకు తిప్పుకుంటాడు. అతీతమైన శక్తులు .. అపారమైన సంపదలు దక్కించుకోవాలంటే, విష్ణుమూర్తి ఆలయానికి సంబంధించిన నాగబంధం విడిపించమని చెబుతాడు. నాగబంధనం విడదీయాలంటే, రహస్యంగా ఉంచబడిన 'బ్రహ్మకమలం'.. 'గరుడ మంత్రాలు'ను సాధించవలసి ఉందని అంటాడు. తనని కాలవృక్షం నుంచి విడిపించడానికి కూడా అవే అవసరమవుతాయని చెబుతాడు. దాంతో అలీ వాటిని సాధించే పనిలో పడతాడు. అందుకోసం తన అనుచరులను అన్ని దిక్కులకు పంపిస్తాడు. 'తులసివనం'లో 'రుద్ర' ( విరాట్ కర్ణ) తన చెల్లెలు మానస (సోనియా సింగ్)తో కలిసి నివసిస్తూ ఉంటాడు. పడవ నడుపుతూ జీవనాన్ని కొనసాగిస్తూ ఉంటాడు. వారి గ్రామదేవత మానసాదేవి. తన చెల్లి రాజు ప్రేమలో పడిందని తెలుసుకున్న రుద్ర, వాళ్ల పెళ్లికి అంగీకరిస్తాడు. పెళ్లి చేయడానికి అవసరమైన డబ్బును ఎలా సమకూర్చాలా అని ఆలోచన చేస్తుంటాడు. అదేసమయంలో అలీ అనుచరులు 'రుద్ర'ను కలుస్తారు. పడవలో తమని 'భైరవకోన' తీసుకెళ్లమని అడుగుతారు. గతంలో బ్రహ్మ కమలం' కోసం ప్రభాకర్ ప్రయత్నించి విఫలమవుతాడు. అతను వదిలేసిన 'భైరవకోన'లోనే ఆ 'బ్రహ్మ కమలం' ఉందని అలీ అనుచరులు తెలుసుకుంటారు. అందువలన అక్కడికి తమని పడవలో తీసుకుని వెళితే పెద్ద మొత్తంలో ముట్టజెబుతామని అంటారు. డబ్బు కోసమే ఎదురుచూస్తున్న 'రుద్ర' వాళ్లను వెంటబెట్టుకుని భైరవకోనకి బయల్దేరతాడు. అలీ మనుషులు అన్వేషిస్తున్న 'బ్రహ్మ కమలం' గురించిగానీ, దాని మహిమను గురించి గాని అతనికి తెలియదు. అందువలన దానిని సాధించడంలో వాళ్లకి సాయపడదామని అనుకుం టాడు. అప్పుడు ఏం జరుగుతుంది? ఆ ప్రయత్నంలో అతనికి ఎలాంటి సవాళ్లు ఎదురవుతాయి? ఆ బ్రహ్మకమల ంతో అతనికి గల సంబంధం ఏమిటి? పురావస్తు విభాగానికి చెందిన ప్రభాకర్ కూడా దానికోసం ఎందుకు ట్రై చేస్తున్నాడు? అనేది మిగతా కథ. అతీతమైన శక్తులను .. అపారమైన సంపదలను ప్రసాదించే



'బ్రహ్మ కమలం' చుట్టూ తిరిగే కథ ఇది. తన స్వార్థం కోసం ఆ బ్రహ్మ కమలాన్ని దక్కించుకోవడానికి విలన్ ప్రయత్నించడం .. హీరో అడ్డు కోవడమే ఈ కథలోని ప్రధానమైన అంశం. పురావస్తు విభాగంలో పనిచేసే ప్రభాకర్ బ్రహ్మకమలం కోసం ఎందుకు ట్రై చేస్తున్నాడు? ఆ బ్రహ్మ కమలాన్ని కాపాడే శక్తి హీరోకి మాత్రమే ఎందుకు ఉంది? అనేది ఆడియన్స్ ను ఆలోచింపజేసే మరో ఆసక్తికరమైన విషయం.

Edited, Printed,Published and Owned by Vadla Madhusudhan chary, H. NO. 42-397 Anjaiah- Nagar, Behind Hanuman temple, ALLWYN COLONY Medchal Malkajgiri, Telangana 500037,
Printed at NALIVELLI EXPRESS, PUBLISHED FROM HNo1-1A9T-10,Main road, pattikonda kurnool, Andhrapradesh 518380, Cell.No.9966555449